



మంత్రి బుగ్గనను సన్మానిస్తున్న నాయకులు

సమాజానికి దిక్సూచి గురజాడ

- విశాల మానవీయ దృక్పథం చాలా అవసరం - గురజాడ వర్ధంతి సభలో సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సమాజానికి గురజాడ దిక్సూచి అని, విజ్ఞాన సర్వస్వమని సాహితీస్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లిరవి పేర్కొన్నారు. కర్నూలు లలిత కళాసమితిలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, సాహితీ స్రవంతి ఐద్వా సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గురజాడ వర్ధంతి సభలో ఆయన ప్రసంగించారు. మూఢత్వం, సాంఘిక దురాచారాల మీద పోరాడిన సంఘసంస్కర్త గురజాడ అన్నారు. మూఢనమ్మకాల మీద పోరాడటానికి నేటికీ ఆయన స్ఫూర్తినిస్తూనే ఉన్నారని చెప్పారు. మతసామరస్యం కోరుకునే వారికి దేవునితో పేచీ కాదని, దేవుని పేరుతో దోపిడీ చేసే వారితో పేచీ అని అన్నారు. సమాజంలోని దురాచారాల మీద కన్యాశుల్కం ఒక బ్రహ్మాస్త్రం మాదిరి పడటంతోనే అది గొప్పతనం సంతరించుకుందన్నారు. బాల్యవివాహాలు, వేశ్యావృత్తి మీద ఎక్కుపెట్టిన నాటకం కన్యాశుల్కం అని చెప్పారు. గిడుగు, వీరేశలింగం హేతువాదానికి ప్రతీకలుగా ఉన్నారని, సమాజాన్ని వెనక్కి తీసుకెళ్లేవాళ్లు, మహిళలను గౌరవించని వాళ్ళు, మతాల మధ్య మంటలు పెట్టేవాళ్ళు ఎప్పుడూ అభ్యుదయవాదులు కాలేరని తెలిపారు. దేశానికి కావలసింది స్వావలంబన, లౌకికతత్వం అని కోరుకుంటే గురజాడ ఔన్నత్యం బోధపడుతుందన్నారు. ప్రజలకు నిజం తెలియకుండా చేసే ఈ పరిస్థితుల్లో సత్యం కోసం గురజాడ చెప్పిన మార్గాన్ని అనుసరించాలన్నారు.



హైకోర్టు మారకుండా న్యాయ రాజధాని ఎలా అవుతుంది?

హైకోర్టు అమరావతి నుంచి కర్నూలుకు మారకుండా న్యాయ రాజధాని ఎలా అవుతుందని తెలకపల్లి రవి ప్రశ్నించారు. కర్నూలులో హైకోర్టు పెట్టడానికి అన్ని పార్టీలు ఒప్పుకున్నాయని, ఏర్పాటు చేసేందుకు ఈ ప్రభుత్వానికి సమస్య ఏమిటని, ఈ విషయంపై కర్నూలులో నిర్వహించే వైసిపి సభలో అడగాలని అన్నారు. లలిత కళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ గురజాడకు ఇంట్లోనే ప్రతిఘటన ఉండేదని, అలాంటి రోజుల్లోనూ సంఘసంస్కర్తగా అభ్యుదయ వాదిగా పేరుపొందారని కొనియాడారు. ఆయన రాసిన కన్యాశుల్కం నాటకానికి ఇప్పటి వరకు ఏ కథ పోటీ రాలేదన్నారు.

అభ్యుదయ, హేతువాదులకు నా వంతు సహకారం
- ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ బి.శంకర శర్మ

అభ్యుదయ వాదులకు, హేతువాదులకు తన వంతు సహకారం అందిస్తానని ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ బి.శంకర శర్మ తెలిపారు. హేతువాదానికి, అభ్యుదయ వాదానికి మంచి రోజులు పోతున్నాయన్నారు. విశ్వాన్ని నాశనం చేసే దుస్థితికి మనిషి వెళ్ళిపోయాడని, రోజు రోజుకు వనరులు దెబ్బతింటున్నాయని, వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. దేశమును ప్రేమించుమన్నా అని గురజాడ అన్నారని, ఇప్పుడు ప్రపంచాన్ని మానవజాతిని, ప్రేమించమని అనాల్సి వస్తోందని తెలిపారు. తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిత్రలేఖనం, ఆటలు, పాటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జెఎన్.శేషయ్య, ప్రజానాట్యమండలి నాయకులు బసవరాజు, మెడికల్ రెప్స్ యూనియన్ నాయకులు ప్రసాద్ శర్మ, కవి చంద్రశేఖర్ కల్కూర పాల్గొన్నారు.

అలరించిన ఆట, పాట...

గురజాడ వర్ధంతి సభలో ఆట, పాట అలరించాయి. ప్రజానాట్యమండలి పాడిన పాటలు, వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకాలు ఆలోచింపజేసాయి. గాయకుడు ఆశన్న "తూరుపు తెల్లవారుతుంది ప్రతి దినం...కాలం గతి మారుతుంది క్షణం." అని, ఇంపైన పలుకు సొంపైన పలుకురా మన తెలుగు దారి చూపు వెలుగు రా!' అని, "గాలిది ఏ కులము ఈ నేలది ఏ కులము అని నాగ సుంకన్న, "విన్నాను అమ్మ ఒడిలో కమ్మనైన తెలుగు ప్రసరించెను విజ్ఞానపు వెలుగు"అంటూ సుబ్బరాయుడు పాడిన గేయాలు వీనుల విందుగా సాగాయి. ప్రజానాట్యమండలి కళాకారులు లోకేష్ దర్శకత్వంలో రూపొందించిన"దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా" అనే నృత్య రూపకంలో గురజాడ వేషధారణలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఇ.రాజు జీవం పోశారు. ప్రజానాట్యమండలి కళాకారులు బతుకన్న, నోమేశ్వరి, కొరియోగ్రాఫర్లుగా వ్యవహరించారు. నగరంలోని హమాలీలు, ఇందిరాగాంధీ నగర్, ముజఫర్ నగర్లలోని విద్యార్థులు నృత్య రూపకం ప్రదర్శించి సబికులను చప్పట్లు చరిచే విధంగా చేశారు. అథేనా పాఠశాల విద్యార్థినిలు ప్రస్తుతం సమాజంలో ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, జరుగుతున్న వాటిని కన్నులకు కట్టినట్టు నృత్య రూపకాన్ని ప్రదర్శించి వావ్ అనిపించారు. రవీంద్ర పాఠశాల విద్యార్థులు మయూరి సినిమాలోని అభ్యుదయ గీతానికి నృత్య రూపకాన్ని ప్రదర్శించారు.

దేశమును ప్రేమించుమన్నా..మంచి అన్నది పెంచుమన్నా.. నృత్య రూపకం



సిఎం నమ్మకాన్ని వమ్ము చేయను

-వైసిపి జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన రామయ్య
- హాజరైన ఆర్థికమంత్రి, ఎంపిలు, ఎమ్మెల్యేలు
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా గెలుపు మాదే

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని వైసిపి నూతన జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నగర మేయర్ బివై.రామయ్య అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపిలు పోచా బ్రహ్మానందరెడ్డి, సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, జడ్‌పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి.మోహన్ రెడ్డిలు బివై.రామయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ విభాగాల కార్యవర్గ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు కూడా రామయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బివై. రామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల జరిగిన జిల్లా అధ్యక్షుల మార్పుచేర్పులలో తన ఒక్కడికే మళ్ళీ అవకాశం లభించినందుకు సంతోషంగా ఉందన్నారు. జిల్లా పార్టీ పగ్గాలను ఏ లక్ష్యం కోసం అయితే తనకు అప్పజెప్పారో ఆ లక్ష్య సాధనకు నిర్విరామంగా కృషి చేస్తానన్నారు. 2019లో ఉమ్మడి జిల్లాలో 14 ఎమ్మెల్యే, 2 ఎంపి స్థానాల్లో వచ్చిన ఫలితాలు పునరావృతం అవుతాయని ధీమా వ్యక్తంచేశారు. వైసిపికి ప్రజాదరణ ఏమాత్రం తగ్గలేదన్నారు. జగన్ మోహన్‌రెడ్డి కన్నా మంచి పరిపాలన చేసే వ్యక్తి రాష్ట్రంలో ఎవరు లేరన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా 175 స్థానాల్లో వైసిపి విజయఢంకా మోగిస్తుందన్నారు. జిల్లాలో ఆది నుంచి ప్రేమాభిమానాలతో అన్ని విధాలా తోడుగా ఉంటూ సహకరిస్తున్న ఎమ్మెల్యేలకు, నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైసిపి నగర అధ్యక్షులు సితార సత్యనారాయణమ్మ, కార్పొరేటర్లు క్రైప పద్మలత, విక్రమసింహా రెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి, షాషావలి, శ్రీనివాసరావు, నాయకులు సిహెచ్. మద్దయ్య, దేవపూజ ధనుంజయఆచారి, ఎన్.గోపాల్‌రెడ్డి, సుభాష్‌చంద్రబోస్, రైల్వే ప్రసాద్, మధుసూదన్, లక్ష్మీపతి, రాజేష్, బాలచంద్రారెడ్డి, మోయిన్‌బాషా, బత్తుల లక్ష్మీకాంతయ్య, శ్రీను, డిష్‌అనిల్, ప్రశాంత్, రమణరెడ్డి, పుల్లారెడ్డి, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో భవిష్యత్తు కార్యాచరణ

- ఆర్థికపర సమస్యలు పరిష్కరించాలి - నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు
- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్ - యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన జాగరణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చకపోతే వారం రోజుల్లో భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ తెలిపారు. ఆర్థికపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహం సమీపంలో యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన జాగరణ చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రవికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరయిన సురేష్ కుమార్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు మాట్లాడారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా చెల్లించాల్సిన జిపిఎఫ్ లోన్లు, సరెండర్ లీవులు, డిఎ అరియర్స్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా చలో విజయవాడలో ధర్నా చేపట్టేందుకు వెళ్లిన ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడకక్కడ పోలీసులతో అక్రమ అరెస్టు చేయించడం బాధాకరమన్నారు. తప్పుడు కేసులు నమోదు చేయడం సరైంది కాదని తెలిపారు. నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. నవంబరు 22న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన తెలియజేసినా ప్రభుత్వం స్పందించకపోవడంతోనే చలో విజయవాడ చేపట్టామని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు హేమంత్ కుమార్, నవీన్ పాటి, మద్దిలేటి, మారెప్ప, తిమ్మన్న, భాస్కర్, ఇబ్రహీం పాల్గొన్నారు.



నిరసన జాగరణలో మాట్లాడుతున్న సురేష్ కుమార్

విద్యా దీవెన కింద రూ.24.78 కోట్లు జమ

- కలెక్టర్ కోటేశ్వర రావు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జగనన్న విద్యా దీవెన కింద 41,230 మంది తల్లుల ఖాతాల్లో రూ.24.78 కోట్లు జమ ప్రభుత్వం జమ చేసిందని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు పేర్కొన్నారు. బుధవారం జగనన్న విద్యా దీవెన త్రైమాసికానికి సంబంధించిన పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు కార్యక్రమం స్థానిక సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావుతో పాటు డిసిఎంఎస్ చైర్మన్ శిరోమణి, బిసి సంక్షేమ అధికారి వెంకట లక్ష్మమ్మ, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాస రావు తదితరులు పాల్గొని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పేద విద్యార్థులకు ఎటువంటి ఫీజు కష్టాలు లేకుండా జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, అమ్మఒడి తదితర పథకాలతో ఎంతో మంది విద్యార్థుల జీవితాలలో ప్రభుత్వం వెలుగు నింపిందన్నారు. జగనన్న విద్యా దీవెన కింద 46,377 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలలో రూ.24.78 కోట్లు జమ చేశారన్నారు. ఇందులో 11,732 మంది ఎస్‌సి సంక్షేమ విద్యార్థులకు రూ.5.79కోట్లు, 856 మంది ఎస్టీ సంక్షేమ విద్యార్థులకు రూ.0.48 కోట్లు, 24,838 మంది బీసీ సంక్షేమ విద్యార్థులకు రూ.13.03 కోట్లు, 2480 మంది ఇబిసి విద్యార్థులు రూ.2.01 కోట్లు, 753 మంది కాపు విద్యార్థులు రూ.0.45 కోట్లు, 5573 మంది ముస్లిం మైనారిటీ విద్యార్థులు రూ.2.92 కోట్లు, 145 మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులు రూ.0.10 కోట్లు లబ్ధి పొందారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లాలో జగనన్న విద్యా దీవెన కింద జూలై - సెప్టెంబరు 2022 మాసాల పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన రూ.24.78 కోట్ల మెగా చెక్కును జిల్లా కలెక్టర్ అందించారు.



చెక్కును అందజేస్తున్న కలెక్టర్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-కోడుమూరు

కోడుమూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బుధవారం ముగ్గురు మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం ... కోడుమూరు సమీపంలో బైకును కారు ఢీకొని కారు కల్వర్టుకు ఢీకొంది. కారు పల్టీలు కొట్టి ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వారిని 108 వాహనంలో కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులు నంద్యాల జిల్లా మిడుతూరు మండలం అలగనూరు గ్రామానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. మృతులు మిడుతూరు మండలం అలగనూరు వాసులుగా గుర్తించారు. కోడుమూరు నుంచి కారు కర్నూలుకు వెలుతుండగా ఘటన జరిగింది. మృతులు యల్లమరాజు, నారాయణ, వెంకటస్వామిగా గుర్తించారు. వీరిలో యల్లమరాజు, నారాయణ తండ్రి కొడుకులు, వెంకటస్వామి వారి బంధువు.



కర్నూలు ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న జి.రామకృష్ణ

గొర్రెల కాపరులకు స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

శకునాల గొర్రెల కాపరులకు జీవాలు ఆపుకునేందుకు స్థలాలు కేటాయించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ కర్నూలు ఆర్‌డిఒను కోరారు. బుధవారం జి.రామకృష్ణ తో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బి.నాగన్న, సిఐటియు నాయకులు జి. శ్రీధర్ రైతు సంఘం నాయకులు చంద్రబాబు నాయుడు, మృత్యుంజయుడు కలిసి వినతి పత్రం అందజేశారు. ఓర్వకల్లు మండలం శకునాల గ్రామ గొర్రెల కాపరులు సోలార్ పరిశ్రమ కోసం భూములను త్యాగం చేశారన్నారు. అటువంటి గొర్రెల కాపరులకు జీవాలను ఆపుకునేందుకు స్థలాలు లేవని, తక్షణమే స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ స్పందించి శకునాలలో ఉన్న గొర్రెల కాపరులకు స్థలాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొర్రెల కాపరులు చాంద్‌బాషా, నాగేశ్వరరావు, పరుశురాముడు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

నేడు ప్రపంచ హెచ్ ఐ వి, ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా విశ్వభారతి వైద్య కళాశాలలో బుధవారం చర్మవ్యాధులు విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి.ఉదయ్ కుమార్ , డాక్టర్ల ఆధ్వర్యంలో విద్యార్థులు నర్సింగ్ సిబ్బంది ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించేందుకు ఉదయం కళాశాల ఆవరణంలో ప్రదర్శన చేశారు. ప్రజలు ఎయిడ్స్ గురించి దాని నివారణ, ఎయిడ్స్ నిర్మూలన గురించి అవగాహన కల్పించేలా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారని డాక్టర్ బి.ఉదయ్ కుమార్ తెలిపారు. నేడు కళాశాలలో ఎయిడ్స్ గురించి సదస్సు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



విశ్వభారతి మెడికల్ కళాశాల ఆవరణలో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు, వైద్యులు

నగర వనాన్ని అభివద్ధి చేయాలి

అటవీ సరంక్షణ సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ నగర శివారులోని గార్గేయపురం గ్రామసమీపంలో నగరవనాన్ని అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనకు ముందు లక్షా 21 వేల హెక్టార్ల విస్తీర్ణం ఉండగా పునర్విభజన తర్వాత కర్నూలు జిల్లాలో అటవీ విస్తీర్ణం 35 వేల హెక్టార్లు మాత్రమే ఉందన్నారు. మొత్తం విస్తీర్ణంలో కేవలం 4.12 శాతం మాత్రమే అడవులు ఉన్న నేపథ్యంలో జిల్లాలోని అటవీ భూములను సంరక్షించుకోవాలన్నారు. జగనన్న శాశ్వత భూ రక్ష , భూ హక్కు పథకం కింద సర్వే నిర్వహించే సమయంలో అటవీ శాఖ భూముల హద్దులు గుర్తించేందుకు వీలుగా అటవీశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రామ సుందర్ రెడ్డి, డిఎఫ్ఒ శివ శంకర రెడ్డి, డిఆర్ఒ నాగేశ్వర రావు, డ్వామా పిడి అమర్‌నాథ్ రెడ్డి, ఆర్‌డిఒలు ,ఫారెస్ట్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రామాంజనేయులుకు ప్రాణహాని జరిగితే

ఎమ్మెల్యే శ్రీదేవిదే బాధ్యత : బత్తిన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కురువ రామాంజనేయులు కు ప్రాణ హాని జరిగితే పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి , సిఎం జగన్మోహన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు హెచ్చరించారు. బుధవారం కర్నూలు జిల్లా టిడిపి కార్యాల యంలో కర్నూలు కార్పొరేషన్ 8వ వార్డు కార్పొరేటర్ కురువ పరమేష్ ఆధ్వర్యం లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బత్తిన వెంకటరాముడు మాట్లాడారు. చెరుకులపాడు నారాయణరెడ్డి హత్యకేసులో ప్రధాన నిందితుడు బీసన్న, రామాంజనేయులు చెరుకులపాడు వదిలి, కాల్వ హుసేనాపురంలో కూలిపని చేస్తూ జీవిస్తున్నప్పటికీ, అతనిపై కక్షకట్టి గత ఆరేళ్లనుంచి అతనికి వారి కుటుంబానికి నిద్రాహారాలు లేకుండా నానా చిత్రహింసలు పెడుతూ మానసిక క్షోభకు గురి చేస్తూన్నారన్నారు. ఇది మంచిపద్ధతికాదనీ పత్తికొండ ఎమ్మెల్యేను హెచ్చరిం చారు. కార్పొరేటర్ పరమేష్ మాట్లాడుతూ ఒక కూలిపనిచేసుకునే వ్యక్తి రౌడీషీటర్ ఎలా అవుతారని ప్రశ్నించారు. కాల్వ ఉసేనా పురంలో ఉన్న వ్యక్తి చెరుకుల పాడులో ఇసుక, మద్యం వ్యాపారం ఎలా చేస్తారని ప్రశ్నించారు. కాబట్టి ఇది ఉద్దేశ పూర్వకంగా ఎమ్మెల్యే చేస్తున్న పనేనని అన్నారు.

గురజాడ నేటి తరానికీ స్ఫూర్తి



గురజాడ వర్ధంతి సభలో మాట్లాడుతున్న పి.నిర్మల

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

గురజాడ ఆశయాలునేటి విద్యార్థులలో స్ఫూర్తిని నింపాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.నిర్మల అన్నారు. బుధవారం రచయిత, సంఘసంస్కర్త, సాహితీకారుడు ,హేతువాది, అభ్యుదయ కవి అయిన గురజాడ 107వ వర్ధంతి సందర్భంగా కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగరపాలక ఉన్నత పాఠశాల ఎపిఎస్‌పి క్యాంపు గురజాడ అప్పారావుకు ఘనంగా నివాళులు అర్పించారు. పాఠశాల హెచ్‌ఎం టి. వెంకటరెడ్డి మాట్లాడుతూ గురజాడ కన్యాశుల్కం ,పూర్ణమ్మ తదితర రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అని కొనియాడారు. ఐద్వా రాష్ట్ర నాయకులు పి. నిర్మల మాట్లాడుతూ కన్యక, పూర్ణమ్మ తదితర రచనలు చేసిన గొప్ప సాహితీ కారులు, హేతువాది గురజాడ అడుగుజాడల్లో నేటి యువత నడవాలని, ఆశయ సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఐద్వా నగర కార్యదర్శి కె. అరుణ , సహాయ కార్యదర్శి జె. కిరణ్మయి, ఎం. కుమారి ,పి. పర్వీన్ ,వై.శిరీష డివైఎఫ్ఐ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు నీలిమ, మహాలక్ష్మి, అనిత, శ్రీకాంత్ తదితరులు పాల్గొని గురజాడ కు నివాళులు అర్పించారు. క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

సాయి సుబ్బయ్య రవీంద్ర స్కూల్స్‌లో గురజాడకు ఘన నివాళి

కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు మాధవినగర్ రవీంద్ర ఇంగ్లీషు మీడియం స్కూలు, రెవెన్యూ కాలనీలో రవీంద్ర టాలెంట్ స్కూల్స్‌లో గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా కరస్పాండెంట్ పిబివి.సుబ్బయ్య ఆధ్వర్యంలో ఘన నివాళ్ళు అర్పించారు. కరస్పాండెంట్ పిబివి.సుబ్బయ్య మాట్లాడుతూ గురజాడ అప్పారావు ఒక ప్రముఖ తెలుగు రచయిత తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు కృషి చేసిన వ్యక్తి అని నవ్యాంధ్ర సాహిత్యానికి వేగుచుక్కఅని కొనియాడాడు. 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అని వెలుగెత్తి అని చాటిన తెలుగు వైతాలికుడు గురజాడ అన్నారు. గురజాడ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలతో ఘనంగా నివాళ్లు అర్పించారు.



గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న పిబివి సుబ్బయ్య

కెవిపియస్ రాష్ట్ర కమిటీకి జిల్లా నుంచి ఐదుగురు

రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎండి.ఆనంద్ బాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



కర్నూలు నగరంలో నవంబర్ నవంబర్ 28, 29 తేదీలలో జరిగిన కెవిపిఎస్ 4వ రాష్ట్ర మహాసభల సందర్భంగా నూతన రాష్ట్ర కమిటిని మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఓ నల్లప్ప, ఆంధ్ర మాల్యాద్రి తిరిగి ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీకి కర్నూలు జిల్లా నుండి ఐదుగురిని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎండి. ఆనంద్ బాబును, రాష్ట్ర కమిటి సభ్యులుగా ఎస్. దేవసహాయం, మహిళ విభాగం నుండి డి.విజయమ్మ, డప్పుకళాకారుల సంఘం నుండి బి.కరుణాకర్, కాటికాపారుల సంఘం నుండి ఎన్‌జి.కష్ణ లను ఎన్నుకున్నట్లు కెవిపియస్ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు తులిపారు.

ఒకటో వార్డులో కల్వర్టుల నిర్మాణం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



పనులను పరిశీలిస్తున్న పి.షాషావలి

కర్నూలు ఒకటో వార్డులో కన్వర్టులు లేని చోట కొత్త కల్వర్టులు నిర్మాణం పాత వాటికి మరమ్మతులు చేయించామని ఆ వార్డు కార్పొరేటర్ పి.షాషావలి అన్నారు. బుధవారం ఆయన కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. షాషావలి మాట్లాడుతూ 1వ వార్డులో గడప గడపకు-మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారన్నారు. వార్డులో చిదంబరరావు వీధి, ఖండేరి వీధులలో డ్రైనేజి కల్వర్ట్స్ లేని, దెబ్బతిన్న కల్వర్టులను గుర్తించి ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మేయర్ బివై.రామయ్య, కెఎంసి కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. వారి సహకారంతో నూతనంగా 3 డ్రైనేజీ కల్వర్ట్ లను నిర్మించడం, పాత కల్వర్ట్స్‌లకు ఐరన్ గ్రిల్స్‌లను బిగించామన్నారు. దీనిపై స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

యనగండ్లలో తాగునీరు వృథా..పట్టాదా సారూ.!

ప్రజాశక్తి సి బెళగల్



వృథాగా పారుతున్న నీరు

మండలంలోనీ యన గండ్లలో బిసి కాలనీలో ట్యాంకు నుండి తాగునీరు వృథా అవుతోంది. ఇక్కడే పలువురు సంబందించిన అధికారులకు పట్టదా సారూ.! అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడే అధిక సమయంలో నీళ్ల వృథా అవుతుండగా అందులో విద్యుత్ మోటార్లు మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రభుత్వం పంచాయతీలకు వదిలే బడ్జెట్ అంతంత మాత్రమే. కనుక తిరిగి మరమ్మతులు చేపట్టుకు సర్పంచులకు భారంగా మారింది. నీటి వృథా కాకుండా కనీసం చర్యలు చేపట్టుటలో దృష్టి సారిస్తే ప్రజలకు నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉండదని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరం

- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



క్రికెట్ ఆడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కళాశాల విద్యార్థులకు సిఎం కప్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. పోటీలను సబ్ కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి విజయాలు అందుకోవాలన్నారు. విద్యార్థులు దేహ దారుఢ్యం కోసం పాఠశాల స్థాయి నుంచి క్రీడలు ఆడాలని సూచించారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయికి ఎంపికవుతారని తెలిపారు. ప్రతి విద్యార్థీ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 25 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి.

విద్యా దీవెన విద్యార్థులకు వరం

- వైసిపి రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



చెక్కును అందజేస్తున్న సీతారామిరెడ్డి

పిల్లలను చదివించే స్థోమత లేని నిరుపేద తల్లిదండ్రులకు జగనన్న విద్యా దీవెన పథకం విద్యార్థులకు వరమని వైసిపి రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మిగనూరు ఆర్‌టిసి డిపో ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వై.సీతారామిరెడ్డి తెలిపారు. బుధవారం శ్రీరాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో విద్యా దీవెన పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ఏర్పాటులో రాంపురం రెడ్డి సోదరుల పాత్ర మరువలేనిదని కళాశాల ప్రిన్సిపల్ సుబ్బరాయుడు కొనియాడారు. అనంతరం వై.సీతారామిరెడ్డి చేతులమీదుగా విద్యా దీవెన చెక్కును విద్యార్థులకు అందజేశారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, నాయకులు శివకుమార్ పాల్గొన్నారు.

చెట్నిహల్లి మారెమ్మ దేవరలో సీతారామిరెడ్డి : మండలంలోని చెట్నిహల్లి గ్రామంలో జరిగిన మారెమ్మ దేవరకు సీతారామిరెడ్డి హాజరయ్యారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు సర్పంచి అంజినయ్య, ఉప సర్పంచి వీరనాగుడు, ఎంపిటిసి రామాంజనేయులు, మాజీ సర్పంచి అల్లింగప్ప డప్పు వాయిద్యాలతో పూలమాలలు వేసి స్వాగతం పలికారు. ఎఎస్ఐ ఆనంద్ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, నాయకులు వెంకటేష్, మల్లికార్జున, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దడం వైసిపి ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైసిపి సీనియర్ నాయకులు బుట్టా రంగయ్య తెలిపారు. పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో జగనన్న విద్యా దీవెనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జగనన్న విద్యా దీవెన కింద 7,226 విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.3,47,80,333 జమ చేసినట్లు చెప్పారు. జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్.నాగలక్ష్మమ్మ, సిద్ధార్థ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్ వేణు గోపాలాచారి, ప్రిన్సిపల్ కమల సుజాత పాల్గొన్నారు.

వైసిపివి కక్ష సాధింపు చర్యలు

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి - హాలహర్వి



సుజాతమ్మను, మల్లికార్జునను సన్మానిస్తున్న విద్యార్థులు

రాష్ట్రంలో వైసిపి నాయకులు అభివృద్ధిని పక్కన పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ విమర్శించారు. బుధవారం మండలంలోని శ్రీక్షేత్ర గుడి ఆంజనేయ స్వామి దేవాలయంలోని కల్యాణ మండపంలో ఆలూరు నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి కోట్ల సుజాతమ్మ హాజరయ్యారు. ముందుగా శ్రీఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు. వెనుకబడిన ఆలూరు నియోజకవర్గం గురించి పట్టించుకొనే నాథుడు లేరని మండిపడ్డారు. నాడు టిడిపి పాలనలోనే రాయలసీమ అభివృద్ధి చెందిందని, ప్రస్తుత వైసిపి పాలనలో ఎలాంటి అభివృద్ధి కూడా జరగ లేదని విమర్శించారు. గ్రామంలోని సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. సిరుగాపురం గ్రామానికి రోడ్డు లేదని, వెంటనే గ్రామానికి ఆ రోడ్డు బాగు చేయాలని కోరారు. టిడిపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు రఘు ప్రసాద్ రెడ్డి, జిల్లా ప్రతినిధి అధికారి కృష్ణం నాయుడు, వాల్మీకి సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్, ఆయా మండలాల కన్వీనర్లు సుధాకర్, అశోక్ యాదవ్, పరమా రెడ్డి, గౌడు, టిడిపి యువ నాయకులు చింతాకులు వెంకటేష్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, శ్రీధర్, హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

కోరం లేక.. ఎదురుచూపులు...

- గంటలో ముగిసిన సమావేశం

ప్రజాశక్తి - ఆదోని

నెలకొక్కసారి నిర్వహించే కౌన్సిల్ సమావేశం పట్ల సభ్యులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ఉండాల్సిన కౌన్సిల్... సభ్యుల నిర్లక్ష్యం కారణంగా ప్రాధాన్యత కోల్పోవాల్సి వస్తోంది. ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి సభ్యులు ఉదయం 11 గంటల నిర్ణీత సమయానికి రాకపోవడంతో కోరం కోసం మున్సిపల్ ఛైర్మన్ శాంత, కమిషనర్ రఘునాథ్ రెడ్డి ఎదురుచూశారు. బుధవారం మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిల్ సమావేశం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా సమావేశానికి కావాల్సిన కోరం సభ్యులు హాజరు కాలేదు. సభ్యుల కోసం ఛైర్మన్‌తో పాటు వైస్ ఛైర్మన్లు నరసింహులు, ఎంఎంజి.గౌస్, కమిషనర్ రఘునాథ్ రెడ్డి, అధికారులు, 14 మంది కౌన్సిలర్లు నిరీక్షించారు. చివరకు కొంతమంది కౌన్సిలర్లు తోటి సభ్యులకు ఫోన్లు చేసి సమావేశానికి రప్పించారు. అరగంట ఆలస్యంగా కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. మున్సిపల్ మేనేజర్ భాస్కర్ రెడ్డి అజెండాను చదివి వినిపించారు. ఇద్దరు, ముగ్గురు కౌన్సిలర్లు కొన్ని సమస్యలపై ప్రశ్నించి కొన్ని నిమిషాల్లోనే సమావేశాన్ని ముగించారు. పట్టణంలో పందుల బెడద తీవ్రంగా ఉందని, నివారించాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి కోరారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని అసిస్టెంట్ కమిషనర్ అనుపమ హామీ ఇచ్చారు. ఇప్పటికే నెల రోజుల సమయం తీసుకుని చేయలేదని, ఇప్పటికైనా చేయాలని కోరారు. పట్టణంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని 1వ వార్డు కౌన్సిలర్ పార్వతి కోరారు. పట్టణంలోని 27వ వార్డులో సచివాలయం ప్లానింగ్ ఉద్యోగి సక్రమంగా విధులు నిర్వహించడం లేదని, ఆయనను బదిలీ చేయాలని కౌన్సిలర్ నాగరత్న కోరారు. రాంజల చెరువు నీటిని తాగేందుకు సరఫరా చేయాలని కౌన్సిలర్ పార్వతి ఛైర్మన్ దృష్టికి తెచ్చారు. సిసి కెమెరాల ఏర్పాటు కోసం గతంలో మున్సిపాలిటీ నుంచి రూ.25 లక్షలు ఖర్చు చేసినా ప్రయోజనం లేని పరిస్థితిని కౌన్సిలర్ బాలాజీ అధికారుల దృష్టికి తెచ్చారు. పోలీసులతో మాట్లాడి సిసి కెమెరాలు, ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన సిగ్నల్ మిషన్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఇంజినీర్ నాగభూషణం రెడ్డి తెలిపారు. కుళాయిలు లేకున్నా పన్ను రావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడే వారని, వాటిని రద్దు చేయడం పట్ల కౌన్సిలర్లు, ఛైర్మన్, కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, డిఇలు రాజు నాయక్, వెంకట చలపతి రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ అస్లాం బాష, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌లు హరినాథ్, శ్రీనివాసులు, మెప్మా ఆఫీసర్ ఎఇ కృపాకర్, కౌన్సిలర్లు చలపతి, అశోక్, చిన్న, రాజేశ్వర్ రెడ్డి, లోకేశ్వరి, వసీం, ఇంతియాజ్ ఉన్నారు.



సమస్యలను విన్నవిస్తున్న టిడిపి కౌన్సిలర్ పార్వతి



సమాధానం చెబుతున్న కమిషనర్ రఘునాథ్ రెడ్డి

క్రీడలపై అభిరుచి పెంచేందుకు ప్రణాళిక

- అక్షరశ్రీ కరస్పాండెంట్ మేఘనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని



పాఠశాల స్థాయిలో విద్యార్థులకు క్రీడల పట్ల అభిరుచి పెంచేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు అక్షరశ్రీ పాఠశాల కరస్పాండెంట్ మేఘనాథ్ రెడ్డి తెలిపారు. అక్షరశ్రీ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నేపథ్యంలో బుధవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కర్నూలు, నంద్యాల జిల్లా స్థాయిలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల ఎంపిక పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో త్రోబాల్, ఖోఖో, బాస్కెట్ బాల్‌లో హరిణి, సందీప్, చెన్న కేశవ రెడ్డి, ధనుష్ ఎంపికైనట్లు తెలిపారు. భవిష్యత్‌లో క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేసి క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను, తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ప్రిన్సిపల్ రాఘవేంద్ర రావు, వైస్ ప్రిన్సిపల్ ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి కంబాలదిన్నె విద్యార్థులు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని కంబాలదిన్నె ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. నంద్యాల పట్టణం మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో కంబాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు టెన్నికాయిట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచారని తెలిపారు. అండర్-17 విభాగంలో బికె.లక్ష్మి, అండర్-14 విభాగంలో బి.భారతి రాష్ట్రస్థాయికి ఎంపికయినట్లు చెప్పారు. విద్యార్థులను, పిఇటి వీరేష్‌ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పోటీల్లో ఎపి మోడల్ పాఠశాల ప్రతిభ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని హెచ్.కైరవాడి గ్రామంలో వివేకానంద యువజన సంఘం నిర్వహించిన వివిధ పోటీల్లో గోనెగండ్ల ఎపి మోడల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు గెలుపొందినట్లు పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. బుధవారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. హెచ్.కైరవాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివేకానంద యువజన సంఘం వారు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, యోగాలాంటి అంశాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వ్యాసరచన పోటీల్లో గోనెగండ్ల ఎపి మోడల్ పాఠశాల పదో తరగతి విద్యార్థి లోకేష్ రెడ్డి మొదటి బహుమతి సాధించి రూ.3 వేల నగదు, మెమొంటో పొందినట్లు చెప్పారు. మూడో బహుమతిని ఎనిమిదో తరగతి విద్యార్థిని నాగలక్ష్మి అందుకున్నట్లు తెలిపారు. క్విజ్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు అజయ్ రెండో బహుమతి, కె.రాముడు మూడో బహుమతి సాధించారని అన్నారు. యోగాలో 9వ తరగతి విద్యార్థిని మమత రెండో స్థానం పొందినట్లు తెలిపారు. 500 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో ప్రతిభను చాటిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయికి 'బాపురం' విద్యార్థులు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని బాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు సర్పంచి శిల్పా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వప్న తెలిపారు. బుధవారం ఎంపికైన విద్యార్థులకు అభినంద సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎపిఎస్‌జిఎం ఉమ్మడి జిల్లాలైన కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించిన త్రో బాల్ అండర్-14, 17 విభాగంలో క్రీడలు నంద్యాలలో నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి ఎంపికయినట్లు చెప్పారు. అండర్-14 బాలుర విభాగంలో ఎం.సురేష్ 9వ తరగతి, అండర్-14 బాలికల విభాగం నుంచి రుక్సంబీ ఎనిమిదో తరగతి, అండర్-17 బాలుర విభాగం నుంచి ఎం.రవి పదో తరగతి ఎంపికయినట్లు తెలిపారు. అనంతరం వారు విద్యార్థులను అభినందించారు. పిఇటి ఆనంద్, గురునాథ్ రెడ్డి, జైపాల్, అహ్మద్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది



నిందితులను ప్రవేశపెట్టి మాట్లాడుతున్న డీఎస్పీ

వీరేష్ హత్యాయత్నం కేసు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండంలోని మురవని గ్రామానికి చెందిన మాల వీరేష్‌ను హత్య చేసేందుకు ప్రయత్నించిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్ తెలిపారు. బుధవారం పెద్దకడబూరు పోలీసు స్టేషన్ ఆవరణలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి ఆయన మాట్లాడారు. పెద్దకడబూరు పోలీసు స్టేషన్ పరిధిలోని హెచ్.మురవని గ్రామానికి చెందిన మాల వీరేష్‌ను చంపడానికి ప్రయత్నించారని తెలిపారు. మండలంలోని రాగిమాన్‌దొడ్డి గ్రామ శివారులోని ఎల్‌ఎల్‌సి దగ్గర నిందితులను ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది అరెస్టు చేసినట్లు తెలిపారు. హుస్సేని, హెచ్.గుమ్మల లాజర్, మోహన్, పెద్ద గుంటెప్ప, సుందర రాజు, అనోకు, అనిల్, కొలిమి నరసన్న, జలికే గుంటెప్పను అరెస్టు చేసినట్లు చెప్పారు. మాల వీరేష్ నిందితుడు హుస్సేని కూతురు సుకన్యను ప్రేమించి వివాహం చేసుకున్నారని కక్ష కట్టి వేట కొడవళ్లు, ఇనుప రాడ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. నిందితుల నుంచి ఆటో, మూడు వేట కుడవళ్లు, మూడు ఇనుప రాడ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కోసిగి సిఐ ఎరిషావలి, ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆదోనిలో తగ్గిన పత్తి ధర

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పత్తి ధర క్వింటా రూ.9,099 పలికింది. పత్తి ధర రూ.18 తగ్గింది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా పత్తి కనిష్ట ధర రూ.5,609, మధ్య ధర రూ.8,469, గరిష్ట ధర రూ.9,099 వరకు పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. బుధవారం మార్కెట్‌కు 847 (3807 క్వింటాళ్లు) లాట్ల పత్తి వచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రతి కార్యకర్త కుటుంబానికీ అండగా ఉంటాం

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు

ప్రజాశక్తి - కౌతాళం



ప్రతి కార్యకర్త కుటుంబానికీ అండగా ఉంటామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు పేర్కొన్నారు. బుధవారం తోవి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు శంకర్ అల్లుడు బంగారయ్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని ఆర్థిక సహాయం అందజేశారు. తన వంతుగా రూ.10 వేలు, సురేష్ నాయుడు యూత్ సభ్యులు రూ.16 వేలు, మొత్తం రూ.26 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యకర్తలే టిడిపికి పునాది అన్నారు. కార్యకర్తలు బాగుంటే పార్టీ ప్రజాసేవ చేయడానికి అన్ని విధాలుగా ముందుకు పోతుందన్నారు. ఆపదలో ఉన్న వారికి తమ వంతు సహకారాలు అందించి ఆదుకుంటామని తెలిపారు. నాయుడు, మేఘన నాయుడు, వలీ, కృష్ణ, శేషు, నాగరాజు పాల్గొన్నారు.

గురజాడ నేటి యువతకు ఆదర్శం

- యుటిఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగమణి - యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురజాడ వర్ధంతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గురజాడ అప్పారావు నేటి యువతకు ఆదర్శమని యుటిఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగమణి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప తెలిపారు. బుధవారం యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలలో గురజాడ అప్పారావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అప్పారావు రచనలు, ఆయన చేసిన సామాజిక సేవల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థినుల నృత్య ప్రదర్శన అలరించింది. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అజిత్, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాము, విజయ్, యుటిఎఫ్ నాయకులు రామాంజనేయులు, రాజు, గర్ల్స్ హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ఆదోని** యుటిఎఫ్ కార్యాలయంలో గురజాడ వర్ధంతి నిర్వహించారు. సభకు విశ్రాంత తహశీల్దార్ షేక్షావలీ అధ్యక్షత వహించారు. సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల బసప్ప, కవయిత్రి జంగం స్వయంప్రభ, కవి నల్లారెడ్డి, రంగన్న, గాదిలింగప్ప, నారాయణ, సుబ్బన్న, రఘురాం పాల్గొన్నారు.



విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న నాయకులు



ఆదోనిలో నివాళులర్పిస్తున్న నాయకులు



త్రీ టౌన్ సిఐగా శ్రీరామ్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని త్రీ టౌన్ సిఐగా శ్రీరామ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సిఐగా పనిచేసిన చంద్రబాబును పోలీసు ఉన్నతాధికారులు ఇటీవల సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో కర్నూలు విఆర్‌లో ఉన్న శ్రీరామ్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని, దొంగతనాలు జరగకుండా ఉంచుతామని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన సిఐ శ్రీరామ్‌కు పలువురు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం

- కుందనగుర్తి సర్పంచి కొండా పురుషోత్తం

ప్రజాశక్తి - చిప్పగిరి

తమ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శాయశక్తుల కృషి చేస్తామని కుందనగుర్తి సర్పంచి కొండా పురుషోత్తం తెలిపారు. బుధవారం క్షేత్రగుడి ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర టిడిపి సమావేశానికి టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ వచ్చిన సందర్భంగా ఆమెతో గ్రామాభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు. సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేస్తూ పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలని సుజాతమ్మ తమకు సూచించారని అన్నారు. గ్రామంలో ప్రధాన సమస్య అయిన తాగునీరు, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. అభివృద్ధి చేస్తూనే టిడిపిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కొండా శ్రీనివాసులు, రామాంజనేయులు, బలరాముడు పాల్గొన్నారు.



సుజాతమ్మను కలిసిన సర్పంచి కొండా పురుషోత్తం

బాలికల హాస్టల్ కోసం స్థల పరిశీలన

- కలెక్టర్‌కు పూర్తి వివరాలు పంపిస్తాం - ఇన్‌ఛార్జీ తహశీల్దార్ మల్లికార్జున

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులోని అరికెర రోడ్డులో ఉన్న బీసీ మేనేజ్‌మెంట్ కళాశాలల బాలికల హాస్టల్ కోసం ఇన్‌ఛార్జీ తహశీల్దార్ మల్లికార్జునతో పాటు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా మాట్లాడుతూ... ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థినులు బీసీ మేనేజ్‌మెంట్ హాస్టల్‌లో అద్దె భవనంలో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. హాస్టల్ పక్కనే పాఠశాలల విద్యార్థుల సమీకృత బాలుర వసతి గృహం (సాంఘిక సంక్షేమ హాస్టల్) స్థలంలో గతంలో నిర్మించిన పాత హాస్టల్ భవనం కూలిపోయి స్థలం నిరుపయోగంగా ఉందని చెప్పారు. ఆ స్థలాన్ని బాలికల హాస్టల్‌కు కేటాయించాలని నవంబర్ 19న కలెక్టర్ కోటేశ్వరరావుకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. స్పందించిన కలెక్టర్... స్థలాన్ని పరిశీలించి వివరాలు పంపించాలని ఆలూరు ఇన్‌ఛార్జీ తహశీల్దార్ మల్లికార్జునకు ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. తహశీల్దార్ సమీకృత బాలుర వసతి గృహం ఆవరణలో పాత హాస్టల్ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. తహశీల్దార్ మల్లికార్జున మాట్లాడుతూ... పూర్తి వివరాలతో కలెక్టర్‌కు నివేదిక పంపిస్తానని తెలిపారు. కళాశాలల బాలికల హాస్టల్ వార్డెన్ ఎర్రమ్మ, కళాశాల బాయ్స్ హాస్టల్ వార్డెన్ సంపత్, సమీకృత బాలుర హాస్టల్ వార్డెన్ మహ్మద్ అలీ, బాలికల ఎస్టీ హాస్టల్ వార్డెన్ సుజాత, డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు రవి, మండల నాయకులు నరేంద్ర, మల్లి, జయచంద్ర, కృష్ణ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్, నాయకులు

ఉపాధి పనులు కల్పిస్తాం...

- ఎవరూ వలసలు వెళ్లకండి

- ఎంపిడిఒ దాసు నాయక్

ప్రజాశక్తి - హొళగుంద

ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తామని, ఎవరూ వలస వెళ్లవద్దని ఎంపిడిఒ దాసు నాయక్ కోరారు. బుధవారం ఎంపిడిఒ సమావేశ భవనంలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో వలసలు వెళ్లారని, ఇక నుంచైనా గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలు వెళ్లకుండా చూడాలని తెలిపారు. కూలిలు తక్కువ పడుతున్నాయని, సరైన సమయానికి కూలి డబ్బులు రావనే అపోహ కూలీల్లో ఉందని చెప్పారు. అపోహలను నివృత్తి చేసి కూలిలు అధికంగా పడాలంటే ఇంత పని చేయాలని చూపించాలన్నారు. జిల్లా అధికారులతో మాట్లాడి సరైన సమయంలో కూలిలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

- సమస్యలపై అధికారుల నిలదీత

ప్రజాశక్తి - నందవరం

మండల సమస్యలు తెలుసుకోవాల్సిన సర్వసభ్య సమావేశం అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్య ధోరణితో తూతూమంత్రంగా సాగింది. సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని కొంతమంది అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. ముఖ్య శాఖలైన రెవెన్యూ, వ్యవసాయ శాఖల మండల స్థాయి అధికారులు వివిధ కారణాలతో సమావేశానికి గైర్హాజరయ్యారు. వాళ్ల తరపున వచ్చిన అధికారులు కూడా కాసేపు మాత్రమే సమావేశంలో కూర్చుని వెళ్లిపోయారు. ఇకనైనా ప్రజాప్రతినిధులను గౌరవించి, ప్రజలకు మరింత సేవలను అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఒకరిద్దరు సర్పంచులు తప్ప ఎవరూ హాజరు కాకపోవడం, గ్రామస్థాయిలో నిధులు లేకపోవడంతోనే సమావేశాలకు హాజరు కాలేకపోతున్నారని సమాచారం. అనంతరం ఆయా శాఖల పనితీరు గురించి మండల అధికారులు వివరించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసిందని, వాటిని వేసవిలోపు ఖర్చు చేసి గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చేస్తామని తెలిపారు. రబీ, ఖరీఫ్ సీజన్లలో రైతులకు నష్టం జరిగితే పంట నమోదు ఆధారంగా పరిహారం అందించేందుకు కృషి చేస్తామని వివరించారు. ఎంపిపి లక్ష్మీదేవమ్మ, ఎంపిడిఒ రాణెమ్మ, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ అథావుల్లా, హౌసింగ్ డిఇ ప్రసాద్, ఎంఇఒ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ చంద్రకాంత్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, పంచాయతీరాజ్ ఎఇలు వెంకట్రాముడు, నాగేంద్ర, జయన్న, ఎపిఎం వీరన్న, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుచరిత, వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి, ఆర్ఐ జనార్ధన్ రావు, ముగతి సర్పంచి విరుపాక్షి రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు శివారెడ్డి గౌడ్, వైస్ ఎంపిపి నడిపి షేక్ సాహెబ్, కోఆప్షన్ సభ్యులు షేక్ అహ్మద్, ఎంపిటిసి జైపాల్ రెడ్డి, వైసిపి నాయకులు ఉదయ్ గౌడ్, హరిచంద్ర, వెంకటరాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రకాంత్



మాట్లాడుతున్న బీవీ

నేటి నుంచి 'ఇదేం కర్మ'

- మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బీవీ

- క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జీలతో సమావేశం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం 'ఇదేం కర్మ' కార్యక్రమం నిర్వస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం నియోజకవర్గంలోని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జీలు, అన్ని మండల, పట్టణ కమిటీ సభ్యులతో కలిసి పట్టణంలోని తన స్వగృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేసినందుకు నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదేం కర్మ కార్యక్రమాన్ని జయప్రం చేయాలని కోరారు. మండల నాయకులు పార్లపల్లి మల్లికార్జున, సోమేశ్వర్ రెడ్డి, సురేష్, నాగరాజు, నరసింహులు, అబ్రహాం, వీరనాగప్ప పాల్గొన్నారు.

'ఉపాధి' చూపించాలి : ఏపీడీ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని 16 గ్రామాల్లోనూ ఉపాధి హామీ కూలీల కుటుంబ సభ్యులు ఎవరూ, ఎక్కడికి వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ పనులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందిని ఇన్‌ఛార్జీ ఏపీడీ సురేష్ బాబు ఆదేశించారు. బుధవారం మండల కార్యాలయంలో ఎపిఒ మాధవ శంకర్ ఆధ్వర్యంలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రాధాన్యత ఉన్న పనులను గుర్తించి ఉపాధి కూలీలు పనులకు వెళ్లేలా చూడాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలి డబ్బులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని, సంబంధిత కూలీల ఖాతాలకు డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పనులను గుర్తించడంలో అలసత్వం వహించిన సిబ్బందిపై తక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు





జగనన్న విద్యా దీవెన మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రమాదాలకు నిలయంగా బిళ్ళాలపురం జంక్షన్

- రాత్రి వేళ కనిపించని రహదారి
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల మండలంలోని బిళ్ళాలపురం గ్రామానికి వెళ్లే కూడలి(జంక్షన్) రోడ్డు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. నంద్యాల పట్టణ శివారులోని చిన్న చెరువు కట్ట మీదగా వెలుగోడు వైపు వెళ్లు రహదారిలో చెరువుకట్ట చివరగా ఉన్న కూడలిలో నిరంతరం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటూనే ఉంది. ఇందుకు కారణం ఆ.. కూడలి (జంక్షన్) చెరువు కట్ట చివర భాగంలో ఉండటమే..

నంద్యాల, మహానంది నుండి వెలుగోడు, ఆత్మకూరు, శ్రీశైలం వైపు వెళ్లే ప్రదాన రహదారి అది. శ్రీశైలం, ఆత్మకూరు, వెలుగోడు నుండి నంద్యాల, మహానంది వైపునకు వెళ్లే రహదారి. దీంతో రోజుకు కొన్ని వందల సంఖ్యలో వాహనాలు ఆ రహదారి పై రాకపోకలు సాగుతుంటాయి. చెరువు కట్ట దిగి అలాగే ముందుకు వెళ్తే వెలుగోడు వస్తుంది, కట్ట మీద నుండి కుడి చేతి వైపు, అలాగే కట్టపైన వెళ్తే బిళ్ళాలాపురం వస్తుంది. బిళ్లాలాపురం నుండి నంద్యాలకు వచ్చే వాహనాలు, వెలుగోడు నుండి వచ్చే వాహనాలు అన్ని కూడా ఒకే చోటా జంక్షన్‌లో కలుస్తుండడంతో నిరంతరం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. కట్ట కింద నంద్యాల వైపు ఎక్కి వచ్చే వాహనాలు, బిళ్లాలపురం వైపు నుండి వచ్చే వాహనాలు సరిగ్గా అక్కడే కలవడం ద్వారా కింది నుంచి వచ్చే వాహనాలు కనిపించక ఎదురెదురుగా ఢీకొంటున్న పరిస్థితి ఉంది. వాహనాలు ప్రమాదం తప్పించుకోవడానికి వీలు లేకుండా రహదారి లేకపోవడం ఇందుకు మరొక కారణం. బిళ్లాలాపురం నుండి వచ్చి నంద్యాల దారిలో కలిసే చోట దారి ఇరుకుగా ఉండడం, పక్కనే చెరువు కట్ట చదునుగా లేకుండా నాలుగు అడుగుల ఎత్తు మట్టికట్ట ఉంది. పైగా సరిగ్గా ఆ కూడలిలో పెద్ద గుంత ఉండడంతో ద్విచక్ర వాహన దారులు, సైకిల్ మీద వెళ్లే వారు, ఆటోల్లో వెళ్లే ప్రయాణికులు ప్రమాదాలకు గురై కాళు ,, చేతులు పోగొట్టుకున్నారు. మరికొంత మంది చికిత్స పొందుతూ మృతి చెందారు. గతేడాది నవంబర్ 8న నంద్యాల ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర ఉన్న గవర్నమెంటు బాలికల పాఠశాలలో పదవ తరగతి

ప్రమాదాలు జరిగే ప్రదేశం (కూడలి) వాహనాలు ఒకే చోట క్రాస్ అవుతున్న దృశ్యం



చదువుతున్న విద్యార్థిని నక్క మేరీసౌమ్య సాయంత్రం స్కూల్ నుండి సైకిల్‌పై బిళ్లలాపురం గ్రామానికి వచ్చే సమయములో ఆ కూడలిలో రోడ్ క్రాస్ చేస్తున్నప్పుడు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయింది. ఆ తరువాత కొద్ది రోజులకే నాంచారి అనే వ్యక్తి ఆటోలో వెళ్తూ అదే కూడలిలో గుంత వద్ద జారి కింద పడ్డాడు. కర్నూల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఆ కూడలి వద్ద రోడ్ క్రాస్ చేసి వెళ్లాలంటేనే బిళ్లాలాపురం ప్రజలు భయపడుతున్న పరిస్థితి నెలకొంది. కొత్త వారికి చీకటి పడిదంటే బిళ్లాలాపురం వెళ్ళడానికి దారి ఉన్న సంగతే తెలియని పరిస్థితి ఉంటుంది. దీంతో రాత్రిళ్ల జరిగే ప్రమాదాలకు లెక్కే లేదు. ఇన్ని ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోతున్నా రోడ్డు భద్రత సిబ్బంది గానీ, రెవిన్యూ అధికారులు, పోలీస్ శాఖ వారు, ఆర్అండ్‌బి అదికారులు, పాలకులు గానీ పట్టించుకోకపోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కట్టను చదును, రోడ్డు వెడల్పు చేసి ప్రమాదాలను నియంత్రించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

నా కడుపు కోత ఏ తల్లిదండ్రులకూ రాకూడదు



ఉదయం స్కూల్‌కి యూనిఫాం దరంచి ఎంతో చక్కగా ముస్తాబై వెళ్ళిన కూతురు సాయంకాలం ప్రమాదానికి గురై నిర్జీవంగా తిరిగి ఇంటికి వస్తుందని ఊహించలేదు. చాలా మంది పిల్లలు గ్రామం నుండి ప్రతి రోజు నంద్యాల పట్టణానికి చదువు కోసం సైకిళ్ల పైనా, ఆటోలలో వెళ్లి వస్తుంటారు. ఇలాంటి ప్రమాదాలు జరిగి ఎవరి బిడ్డలూ ప్రాణాలు కోల్పోకూడదు. నాలాంటి కడుపుకోత ఏ తల్లిదండ్రులకూ రాకూడదు. ప్రమాదాలకు నిలయమైన నంద్యాల నుండి బిళ్లలాపురంకు వచ్చే రహదారిని అధికారులు వెడల్పు చేయాలి.

నక్క తిమ్మయ్య, బిళ్లలాపురం.
ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయిన మేరీ సౌమ్య తండ్రి.

అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం



ప్రమాదం జరిగిన ప్రతిసారి ధర్నాలు నిర్వహించి అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్తున్నాం. అధికారులు జెసిబితో కట్ట మట్టిని కొంచం తవ్వి పైకి వేసి వెళ్తారే తప్ప సమస్యకు శాశ్విత పరిష్కారం చూపడం లేదు. ఆర్అండ్‌బి, రెవిన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు ఏ ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదు. మహానంది రోడ్ వైపు చెరువు కట్ట మీద మాత్రం ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకపోయినా లక్షల రూపాయలు ఖర్చు చేసి గ్రావెల్ రోడ్, పెన్సింగ్, విద్యుత్ స్తంభాలు వేశారు. అదే బిళ్ళాలాపురం వైపు కట్ట చదును చేసి రోడ్ వెడల్పు చేసి గ్రామం నుండి వచ్చే వాహనాలు, వెళ్లేవి వాటికి మాలలమ్మ దేవాలయం దగ్గర వరకు సర్కిల్ ఏర్పాటు చేసి రాత్రి వేళలో ఆ జంక్షన్ కనిపించే విధంగా ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేస్తే ఎంతో బాగుంటుంది. బిళ్ళాలాపురం కట్ట మీద ముళ్లచెట్లు తొలగించి రోడ్ వెంట విద్యుత్ స్తంభాలు వేసి గ్రామం వరకు అభివృద్ధి చేస్తే ఉదయం, సాయంత్రం వందల సంఖ్యలో వాకింగ్ వచ్చే ప్రజలకు కూడా సౌకర్యంగా ఉంటుంది. ఎమ్మెల్యే శిల్పా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమస్యను పరిశీలించి పరిష్కరించాలి. ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా కాపాడాలి.

జయన్న, మాలమహానాడు మండల నాయకులు.

'జగనన్న విద్యా దీవెన' జమ

- 38,673 మంది తల్లుల ఖాతాల్లోకి రూ. 25.61 కోట్లు
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో నాల్గవ విడత జగనన్న విద్యా దీవెన కింద 2022 జులై, సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించి 43,707 మంది విద్యార్థులకు గాను అర్హులైన 38,673 మంది తల్లుల ఖాతాలలో రూ.25.61 కోట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి జమ చేశారని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ పేర్కొన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా మదనపల్లి బహిరంగ సభ వేదిక నుంచి 4వ విడత జగనన్న విద్యా దీవెన పథకం కింద అర్హులైన విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసే కార్యక్రమాన్ని సిఎం జగన్ మోహన్ రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకూడదన్న ప్రధాన ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా దీవెన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. చదువుల ఖర్చుతో తల్లిదండ్రులు అప్పులపాలు కాకుండా త్రైమాసికం ముగిసిన వెంటనే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఫీజుల మొత్తాలను నేరుగా రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. ఈ పథకం కింద ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే అర్హులైన పేద విద్యార్థులు కళాశాలలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులను అభ్యసించాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో జగనన్న విద్యా దీవెన మెగా చెక్కును సంబంధిత విద్యార్థులు, తల్లులకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు చింతామణి, వివిధ సంక్షేమ అధికారులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** జగనన్న విద్య దీవెన విద్యార్థులకు వరం లాంటిదని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి అన్నారు. స్థానిక ఆవుల పుల్లారెడ్డి సేవాసమితి కార్యాలయంలో జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 6500 తల్లుల ఖాతాలో జగనన్న విద్య దీవెన కింద 7328 మంది విద్యార్థులకు రూ.4.32 కోట్ల మొత్తాన్ని జమ చేసినట్లు చెప్పారు. ఎంపిడివో సుబ్బారెడ్డి, ఎంఈఓ శోభా వివేకావతి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మీదేవి, వసతి



జగనన్న విద్యా దీవెన చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల

ప్రజల ఆనందమే జగనన్న ధ్యేయం : మంత్రి బుగ్గన

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్ర ప్రజల యోగక్షేమాలు, ఆనందమే ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బేతంచెర్లలోని ఎన్జీవోస్ కాలనీలో రూ. 35 లక్షలతో అభివృద్ధి చేసిన పార్కును మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రతి గ్రామంలోని కుటుంబానికి అందేవిధంగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. 15 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని ఎన్జీవోస్ కాలనీ పార్కును జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత వెంటనే నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. డోన్‌లో నగర వనం పార్కు, బేతంచర్లలో బిపి శేషారెడ్డి చిల్డ్రన్స్ పార్కును 35 లక్షల రూపాయలతో మంచి ఆహ్లాదకరమైన పూల మొక్కలు, పిల్లలు ఆడుకునేందుకు ఆట సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. ఎన్జీవోస్ కాలనీలోని మహిళలు తమ కాలనీకి నీటి సదుపాయం సరిగా లేదని, వారానికి ఒకసారి వస్తున్నాయని మంత్రికి విన్నవించారు. వెంటనే మంత్రి స్పందిస్తూ సాధ్యమైనంత త్వరలో పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్ బాబు, చైర్మన్ చలం రెడ్డి, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు కొమ్ము మధు, ఇబ్రహీం, కోడే వెంకటేశ్వర్లు, నారాయణ, బలరామిరెడ్డి, ముబీనా బేగం, ఖాజా, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్కును ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

పోగొట్టుకున్న మొబైల్స్ రికవరీకి చర్యలు :

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోగొట్టుకున్న మొబైల్స్‌ని తిరిగి రికవరీ చేయడానికి నంద్యాల జిల్లా పోలీసులు కృషి చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కే రఘువీర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్ పరిధులలో ఎవరైనా మొబైల్ ఫోన్స్ పోగొట్టుకున్న వారు ఉంటే జిల్లా పోలీసు కార్యాలయంలోని 9121101107 నంబర్‌కి 'హాయ్' అనే ఒక టెక్స్ మెసేజ్‌ని వాట్సాప్ యాప్ ద్వారా పంపాలని, ఒక లింకుని ఆటోమేటిక్‌గా రిసీవ్ చేసుకొంటారని తెలిపారు. సదరు లింకు నందు మీ డీటైల్స్, పోయిన మొబైలు డీటైల్స్ ఎంటర్ చేయడం వలన సమాచారం పోలీసులకు వస్తుందన్నారు. ఆ మొత్తం డీటైల్స్‌ని పోలీసులు క్రాస్ చెక్ చేసుకొని మొబైల్స్‌ని రికవరీ చేస్తారని తెలిపారు.

వ్యకాసం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు - మహాసభ గోడపత్రికలు విడుదల

ప్రజాశక్తి - నంద్యాల

ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో ఈ నెల 8, 9, 10వ తేదీలలో జరుగుతున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.నాగేశ్వరావు, ఎం.సుధాకర్‌లు కోరారు. బుధవారం నంద్యాలలో టి.నరసింహయ్య భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ గోడపత్రికలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభకు మాజీ ఎంపీ బృందాకరత్, ఆల్ ఇండియా అధ్యక్ష కార్యదర్శులు విజయ రాఘవన్, బి.వెంకట్ హాజరవుతున్నారని తెలిపారు. ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల భూమి పంచాలని, ఉపాధి హామీ చట్టం ద్వారా 200 రోజులు పని కల్పించి, రోజు వేతనం రూ.600 ఇవ్వాలని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించాలని, అర్హులైన పేదలకు 5 సెంట్ల స్థలమిచ్చి, రూ.5 లక్షల నిధులతో పక్క గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. ప్రజా పంపిణీ ద్వారా 15 రకాల నిత్యవసర సరుకులు అందించాలని, వితంతు, వృద్ధాప్య, వికలాంగులు, ఒంటరి మహిళలకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని, విద్య, వైద్యం, 25 శాతం ప్రైవేట్ రంగాల్లో పేదలకు ఉచితంగా అందించాలని తదితర సమస్యలపై రాష్ట్ర మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు బహిరంగ సభకు వేలాదిమంది వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో వ్యకాసం సీనియర్ నాయకులు డి.బాల ఉసేని, ట్రెజరర్ ఆర్.ఈశ్వరయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు హైమావతి, ఫకీర్ సాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు బంగారయ్య, కృష్ణ, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు. **గోస్పాడు :** వసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి ఎన్.చెన్నయ్య, అధ్యక్షులు కరీం భాష, అంకన్నలు కోరారు. గోస్పాడులో వ్యకాసం రాష్ట్ర మహాసభ గోడపత్రికలను వారు విడుదల చేశారు.



రాష్ట్ర మహాసభ గోడ పత్రికలను విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



భూమి పూజ నిర్వహిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

నాడు-నేడు పనులకు భూమి పూజ

రుద్రవరం : మండలంలోని తిమ్మనపల్లి గ్రామంలోని పాఠశాలలో నాడు-నేడు కింద అభివృద్ధి పనులకు వైసిపి నాయకులు బుధవారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకుడు దశమి జయపాల్ మాట్లాడుతూ నాడు-నేడు అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.25 లక్షల నిధులతో పాఠశాలలో అదనపు గదులు, ప్రహరీ గోడ, మరుగుదొడ్ల నిర్మాణం, పాత స్లాబ్ తొలగించి కొత్త స్లాబ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సురేంద్ర, నరసాపురం నాయకుడు కందుకూరి లక్ష్మీనారాయణ రెడ్డి, ఇంజనీర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులను పరిశ్రమల్లో కార్మికులుగా మారుస్తున్న ఇంటర్న్‌షిప్ : ఎస్ఎఫ్ఐ

నంద్యాల : రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానంలో భాగంగా డిగ్రీ చదివే విద్యార్థులకు చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ తీసుకువచ్చి పరిశ్రమలలో కార్మికులుగా మార్చిందని ఎస్ఎఫ్ఐ నంద్యాల పట్టణ నాయకులు మధు, కిరణ్ విమర్శించారు. బుధవారం నంద్యాలలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానానికి అమలు చేయడానికి ముందుకు రాకపోయినా ఎపిలో మాత్రం వైసిపి ప్రభుత్వం అమలు చేయడం బాధాకరమన్నారు. డిగ్రీ చదివే విద్యార్థులను పరిశ్రమలలో ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేయాలని, ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ ఉంటేనే 6వ సెమిస్టర్ పాసైనట్లని కళాశాల యాజమాన్యం చెప్పడంతో విద్యార్థులతో పరిశ్రమల యాజమాన్యం అనేక రకాల పనులు చేయించుకోవడం దౌర్భాగ్య మన్నారు. ప్రభుత్వం బాధ్యతగా తీసుకొని పరిశ్రమల్లో విద్యార్థులను ఇంటర్న్‌షిప్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని, కార్మికులు చేయాల్సిన పనులు విద్యార్థులతో చేయిస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గోపాల్, సుమంత్, మధు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు మధు, కిరణ్

అధికారుల దూకుడుకు కళ్లెం వేయండి : భూమా

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

రాజకీయ కక్షతో ప్రతినిధుల ఒత్తిడితో ప్రతిపక్ష నేతలను ఇబ్బంది పెడుతున్న అధికారుల దూకుడుకు కలెక్టర్ గారు కళ్లెం వెయ్యాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మ నంద రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొండారెడ్డిలు కోరారు. బుధవారం వారు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కొండారెడ్డి మాట్లాడుతూ నంద్యాల రైల్వే స్టేషన్ సమీపంలో హృదయ ఇన్ పేరుతో తాను లాడ్జి నిర్మించామని, ఎలాంటి ఆక్రమణలు లేకపోయినా మున్సిపల్ సిబ్బంది ఆక్రమణల తొలగింపు పేరుతో తమ ప్రాంగణం వద్దకు వస్తున్నారన్నారు. సాక్షాత్తు కమిషనర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఎలాంటి ఆక్రమణలు లేవని ధృవీకరించుకున్నా స్థానిక అధికార పార్టీ కౌన్సిలర్ ఒత్తిడితో సిబ్బంది వచ్చి వేధిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ కమిషనర్‌తో మాట్లాడి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.



వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే, మాజీ కౌన్సిలర్

వసతి గృహానికి సొంతభవనం ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న ఎస్సీ కళాశాల బాలుర సంక్షేమ వసతి గృహానికి సొంత భవనం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు మొహమ్మద్ రఫీ, ఓబులేష్‌లు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ రామకృష్ణకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాన్ని గోడౌన్లలో ఏర్పాటు చేయడంతో వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చీకటి పడితే బయటికి రావాలంటేనే భయపడుతున్నారని చెప్పారు. వార్డెన్ విద్యార్థులను పట్టించుకోవడం లేదన్నారు. సరైన గదులు, మరుగుదొడ్లు, కరెంటు సప్లై, డోర్లు లేవని తెలిపారు. మెనూ ప్రకారం విద్యా ర్థులకు భోజనాలు ఏర్పాటు చేయడం లేదన్నారు. ప్రతిరోజు ఇవ్వాల్సిన గుడ్డు, అరటిపండు వారానికి రెండు రోజులే ఇస్తున్నారని, విద్యార్థులకు గదిలో స్థలం సరిపోక బయట పడుకుంటున్న పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి సొంత భవనం ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు మహాదేవ్, సహాయ కార్యదర్శులు అనిల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

4న జిల్లాస్థాయి శాప్ చెస్ లీగ్ పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాల పట్టణంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియం ఆవరణంలో ఈ నెల 4న ఓపెన్ చదరంగం పోటీలు నిర్వహిస్తునన‌ట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు ఎంఎన్‌వి.రాజు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ జి. రామసుబ్బారెడ్డిలు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 2వ తేదీ లోపు వెబ్సైట్ (ap.chess.org) నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రవేశ రుసుం రూ.200, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.100 చెల్లించాలని, ఇతర వివరాలకు 9010451585, 9642762731, 9573661799 నెంబర్లు సంప్రదించాలని కోరారు.

జెసిని కలిసిన మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నూతనంగా నియమితులైన జాయింట్ కలెక్టర్ టి.నిశాంతిని ఆమె ఛాంబర్‌లో మునిసిపల్ కమిషనర్ సి.రవి చంద్రారెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



నియామకపత్రాలు అందజేస్తున్న దృశ్యం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలి

శిరివెళ్ల : కుల, మత, వర్గ, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాలని సర్పంచి కందుల మల్లీశ్వరి ప్రసాద్ రెడ్డి వాలంటీర్లకు సూచించారు. బుధవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో నూతనంగా ఎంపికైన గ్రామ వార్డు వాలంటీర్లకు ఎంపిడిఒ సుబ్రమణ్యం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు నాయక్ మహమ్మద్ వసీం, మాజీ ఎంపిటిసి నాయక్ ముజఫర్ హుస్సేన్, మాజీ ఉప సర్పంచి పిటిఆర్.తిరుపతి రెడ్డి, వైసిపి నాయకులు ముజాఫర్, ఇఒపియర్డి సాల్మాన్ రాజ్, పంచాయతీ సెక్రెటరీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను డిఎంహెచ్ఒ తనిఖీ

మహానంది : మహానందిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను డిఎంహెచ్ఒ వెంకటరమణ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు ఉన్న ఆరోగ్య సమస్యల గురించి ఆరా తీసి పాఠశాల హెచ్ఎంకు సూచనలు చేశారు. వైద్య బృందం ఎప్పటికీ అందుబాటులో ఉంటుందని, ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే మండల వైద్య బృందానికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి చంద్రశేఖర్, సిబ్బంది, గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్ఎం అంబమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు విద్యార్థులు ఎంపిక

ఉయ్యాలవాడ : మండలంలోని బోడెమ్మనూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు షటిల్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం చంద్రశేఖరయ్య తెలిపారు. బుధవారం విద్యార్థులను అభినందించి మాట్లాడారు. విద్యార్థినులు ప్రణీత, శ్రావణిలు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. పిటి చిన్న మౌలాలి, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, దక్షిణామూర్తి ఆచారి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ప్రచారం

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి బుధవారం నంద్యాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. సచివాలయాలను సందర్శించి సచివాలయ ఉద్యోగులను, వాలంటీర్లు, గ్రాడ్యుయేట్స్‌ను ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపంచాలని అభ్యర్థించారు. వైసిపి నాయకులు, కోఆర్డినేటర్లు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని ఎంపిడిఒ పరిశీలన

కొలిమిగుండ్ల : మండలంలోని మీర్జాపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని ఎంపిడిఒ సుబ్బరాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంపౌండ్ వాల్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఎపిఇడబ్ల్యుఐడిసి ప్రవీణ్ కుమార్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ సుబ్బ రాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీ వాణీ, హెచ్ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని డిప్యూటీ కలెక్టర్ తనిఖీ

గోస్పాడు : గోస్పాడులోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనం నాణ్యతను స్వయంగా తిని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఎంపిడిఒ సుగుణ శ్రీ, ఎంవి అబ్దుల్ కరీం, ప్రిన్సిపాల్ ఖాజా హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కొలిమిగుండ్ల : ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైసిపి నాయకులు గోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని బెలుం శింగవరం గ్రామంలో శాంతిరాం ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు శిబిరంలో వైద్యులు బిపి, షుగర్, గుండె సంబంధిత వ్యాధులకు పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన

రుద్రవరం : రుద్రవరం ఆదర్శ పాఠశాలలో ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ప్రిన్సిపాల్ నాగేశ్వర రావు అధ్యక్షతన డాక్టర్ శ్రావణి, నాగేశ్వరి, యోగీశ్వరయ్య, సరళ, చైతన్య రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సమాజంలోని ఎయిడ్స్ బాధితులకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని సూచించారు. అనంతరం రాజ్ నారాయణ, లలిత సమక్షంలో పిల్లలకి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే విజయం సాధ్యం

బనగానపల్లె : క్రమశిక్షణతోనే విజయం సాధ్యమని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానంద చారి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పలుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్ఎస్ బ్రహ్మానంద చారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల పట్టణానికి చెందిన విద్యా వారధి చైర్మన్ ఫౌండర్ జి.సుబ్బరాజు సహకారంతో 10వ తరగతి విద్యార్థులకు 'మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి 100 సూత్రాలు' ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ రచించిన పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పరీక్షలలో విజయం-విద్యా ఆవశ్యకతపై సదస్సు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం మల్లికార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టాభిరామ మందిరానికి భూమి పూజ

కొలిమిగుండ్ల : మండలంలోని కోరుమానుపల్లి-అబ్దుల్లాపురం గ్రామాల సమీపంలో ఉన్న గుండం ఆంజనేయ స్వామి ఆలయంలో పట్టాభిరాముడు మందిరానికి వైసిపి నాయకులు ఓబుల్ రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. నిర్వాహకులు శివరామిరెడ్డి, గౌడ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండయ్య గౌడ్, ఎంపిటిసి పులి రామకృష్ణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

5న ధర్నాను జయప్రదం చేయండి : సిపిఐ

గోస్పాడు : జగనన్న కాలనీ లబ్ధిదారులకు గ్రామీణ ప్రాంతాలకు రూ. 5 లక్షలు, పట్టణ ప్రాంతాలకు రూ. 7 లక్షలు ఇవ్వాలని ఈ నెల 5న తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాలో లబ్ధిదారులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు కోరారు. బుధవారం గోస్పాడులో సిపిఐ ఆధ్వర్యంలో మండల సహాయ కార్యదర్శి జిలాన్ భాష అధ్యక్షత సమావేశం నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, వ్యకాసం నాయకులు రాధాకృష్ణ, జిల్లా సమితి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు : టిడిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులపైన వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టించి భయభ్రాంతులకు గురిచేస్తే భయపడే ప్రసక్తే లేదని డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి, జిల్లా నాయకులు వలస రామకృష్ణ అన్నారు. బుధవారం బేతంచెర్ల మండల కేంద్రం నంద్యాల రోడ్డులోని జిఎస్ఆర్ ఫంక్షన్ హాల్ నందు డోన్ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడుగా ఎర్రమల నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి, జిల్లా నాయకులు వలసల రామకృష్ణ, డోన్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మురళీ కృష్ణ గౌడ్, గొర్రెల పెంపకం రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసినా.. వాటి ఆఫీసుల్లో కూర్చోడానికి కుర్చీలు, టేబుల్ కూడా లేవని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు బీసీలకు 36 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే నేడు వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 26 శాతం తగ్గించిందనానరు. అనంతరం 20 మందిని ఎన్నుకున్న డోన్ నియోజకవర్గం టిడిపి బీసీ సెల్ సభ్యులతో వలసల రామకృష్ణ, ధర్మవరం ప్రమాణం చేయించారు. తదనంతరం డోన్ ఏక్ వర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ఎర్రమల నాయుడు వలసల రామకృష్ణను, ధర్మవరం సుబ్బారెడ్డిలను పార్టీ కార్యకర్తలు, నాయకులు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల మండలం కన్వీనర్ ఉన్నము ఎల్ల నాగయ్య, పట్టణ కార్యదర్శి శిక్షావల్లి చౌదరి, నంద్యాల పార్లమెంటు ఉపాధ్యక్షుడు పోలూరి వెంకటేశ్వర్ రెడ్డి, ఉన్నం చంద్రశేఖర్ చౌదరి, కౌన్సిలర్ రామ్మూర్తి, బుగ్గన పల్లి రమేష్, సురేష్, నంద్యాల మధు, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు మేకల నాగరాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర నాయక్, రామాంజనేయులు, మహిళలు నీతమ్మ, సులోచన, శ్రీదేవి, వాణిజ్య కమిటీ మెంబర్ భీమారెడ్డి, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణం చేస్తున్న టిడిపి నాయకులు

ఐటిఐ కళాశాలకు భూమి పూజ

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని పెద్దవంగలి గ్రామంలో సుమారు 4 కోట్ల రూపాయలతో నిర్మించ తల పెట్టిన మైనారిటీ ఐటిఐ కళాశాలకు మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల భిజేంద్రారెడ్డిలు బుధవారం భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక విద్యను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో విద్య,వైద్యం, వ్యవసాయం,మహిళల పురోగతికి అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. కళాశాల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేలా గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ సలహాదారులు హాభిబుల్లా,ఎంపిపి వీరభద్రుడు,సర్పంచ్ బంగారు షరీఫ్ ,మార్కెట్ యార్డ్ చైర్మను గంధం రాఘవ రెడ్డి,రాష్ట్ర వైసిపి మైనారిటీ సెల్ కార్యదర్శి బాబులాల్,మండలకన్వీనర్ కుమార్‌రెడ్డి,ఎంపిటిసి లక్ష్మిరెడ్డి,వైసిపి నాయకులు పుల్లయ్య,లాలు, గౌస్‌పీరా, జిల్లా ప్రచార కార్యదర్శి గణేష్ రెడ్డి, తహసీల్దార్ విజయకుమార్,సాంకేతిక విద్య ఈఈ లక్ష్మినారాయణ, డిఈ బాలజోజప్ప,కాంట్రాక్టర్ జనార్ధన్,సైట్ ఇంజనీరు రామచంద్రయ్య,వైసిపి నాయకులు రామగురివిరెడ్డి, షబ్బీర్, బాల నరసింహుడు, జబ్బార్, మహబూబ్‌వళి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకంను ప్రారంభిస్తున్న మండలి విప్,ఎమ్మెల్యే లు

ఎస్జీఎఫ్ జూడో సెలక్షన్స్ ప్రారంభం

ప్రజాశక్తి - నందికొట్కూరు

పట్టణంలో నంద్యాల-కర్నూలు జిల్లాల ఉమ్మడి పాఠశాల క్రీడా సమాఖ్య అండర్ 17, 14 బాల, బాలికల జూడో సెలక్షన్స్ శ్రీ నవనంది హైస్కూల్లో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సెలక్షన్స్‌కు ముఖ్య అతిథులుగా కర్నూలు జిల్లా జూడో సంఘం సీఈఓ బద్దుల శ్రీధర్, కర్నూలు జిల్లా ఎస్జీఎఫ్ నిర్వహణ కార్యదర్శి లక్ష్మయ్య, కర్నూలు జిల్లా జూడో సంఘం అధ్యక్ష, కార్యదర్శు లు సూది రెడ్డి, శ్రీధర్ రెడ్డి, బద్దుల శ్రీకాంత్, కర్నూలు నంద్యాల జిల్లాల శాప్ కోఆర్డినేటర్లు శ్రీనాథ్, రవికుమార్ పాల్గొన్నారు. ముందుగా వారు పూజా కార్యక్రమంతో సెలక్షన్స్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు చంద్రమోహన్, సత్యకుమార్, ముస్తాహిర్, గంగాధర్, శ్రీనివాసులు, డొరతి, విష్ణుప్రియ, సుమలత, కల్యాణి యన్.ఐ.యస్ జూడో కోచ్ సోమశేఖర్, ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, సుబ్బన్న, శాంతి రాజు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా దీవెనతో విద్యార్థుల జీవితాల్లో వెలుగు

- మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా

ప్రజాశక్తి - ఆత్మకూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన జగన్న విద్యాదీవెన పథకం విద్యార్థుల జీవితాలలో వెలుగు నింపుతోం దని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా అన్నారు. బుధవారం పట్టణంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన విద్యా దీవెన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రూ.3. 20 లక్షల చెక్కును పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఆసియా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పెనుకొండ శ్రీనివాసరావు, వార్డ్ కౌన్సిలర్ హరి ప్రసాద్, సుల్తాన్, మండల జడ్పిటిసి శంకర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రాజ్యలక్ష్మి, ఏటిడబ్ల్యూఓ అధికారి సుబ్బారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ వసుంధర దేవి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో జగనన్న విద్యా దీవెన మూడవ విడత పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్క రణలు తీసుకొచ్చిందన్నారు. అనంతరం జగనన్న విద్యా దీవెన పథకానికి సంబం ధించిన మెగా చెక్కును విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి హుస్సేనయ్య, ఎంపీపీ మురళి కృష్ణా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిషోర్, తహశీల్దార్ రాజశేఖర్ బాబు, ఎంపీడీఓలు శోభారాణి,వెంకట రమణ, మండల విద్యాధికారులు సుభాన్, ఫైజున్నిసా బేగం, కౌన్సిలర్లు చిన్న రాజు, రవుఫ్, నాయబ్, వైసీపీ నాయకులు అబ్దుల్లా, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు మహేశ్వరుడు, రవికుమార్, ముంతాజ్ ,శ్రీనివాస నాయక్, విజయ్ ,అనిత తదితరులు పాల్గొన్నారు.


విద్యా దీవెన చెక్కును విడుదల చేస్తున్న డాక్టర్ ఆసియా

రియల్ ఎస్టేట్‌ల నుండి దోబిఘాట్లను కాపాడాలి

- రజక సంఘం జిల్లా కార్యదర్శి గుణశేఖర్

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలో ఉన్న దోబీ ఘాట్ స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుండి కాపాడాలని రజక సంఘం జిల్లా కార్యదర్శి గుణశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం దోబి ఘాట్ స్థలాన్ని రజక సంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం 35 ఏళ్ల కిందట రజక వృత్తి నిర్వహణ కొరకు నాలుగు ఎకరాల 75 సెంట్లు స్థలాన్ని రజక వృత్తిదారులకు కేటాయించగా.. దీనిని ఈ మధ్యకాలంలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇప్పటికే 10 సెంట్లు స్థలాన్ని ఆక్రమించి, ఇతరులకు అమ్మేసి రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు ప్రజాప్రతినిధులు రజకవృత్తి నిర్వాణ కొరకు ధోబీఘాట్లు నిర్మించాలన్నారు. ప్రస్తుత దోబీ ఘాట్ శిథిలావస్థలో ఉందని, దానికి మరమ్మతులు చేసి ఈ స్థలాన్ని కాపాడాలన్నారు. అనంతరం డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా కన్వీనర్ సి. వెంకటేశ్వర్లు ఆత్మకూర్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు బంగారప్ప, జే నాగేంద్రుడు, జయన్న, పెద్ద పుల్లయ్య, రామకృష్ణ, పాములపాడు మండలం కార్యదర్శి రామకృష్ణ, బండి ఆత్మకూరు మండలం కార్యదర్శి గోకరమయ్య, ఆత్మకూరు మండల కార్యదర్శి కురుకుంద నాగశేషులు,. నాయకులు పాల్గొన్నారు.


కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న రజక సంఘం జిల్లా నాయకులు

అరెస్టులు అప్రజాస్వామికం : యుటిఎఫ్

ప్రజాశక్తి - ప్యాపిలి

ఉద్యోగ, ఉపాధ్యాయుల పిఎఫ్, ఏపిజిఎల్ఐ, ఇఎల్ఎస్ బకాయిలు చెల్లించాలని ధర్నా చేస్తున్న యుటిఎఫ్, పిడిఎఫ్, ఎమ్ఎల్‌సిలను, ఉపాధ్యాయులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అని యుటిఎఫ్ సీనియర్ నాయకులు అబ్దుల్ లతీఫ్ పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ నవంబర్ 30వ తేదీన రాష్ట్ర కేంద్రంలో ధర్నా చేస్తామని ముందస్తు నోటీసులు ఇచ్చి అనుమతి తీసుకున్న...అనుమతి లేదని ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి బైండోవర్ చేశారని విమర్శించారు.

ఉపాధి హామీ జీవనోపాధికి వెన్నెముక : ఎంపిపి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అభివృద్ధికి, జీవనోపాధికి వెన్నెముక లాంటిదని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిన్న సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ భవనం నందు జరిగిన ఉపాధి హామీ సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా జగనన్న గృహాల నిర్మాణానికి 90 రోజుల పనితనాలు ఇవ్వడం జరుగుతుందని, ఆయకట్లు, రోడ్ల నిర్మాణం కోసం పండ్ల తోటల పెంపకం, అవెన్యూ ప్లాంటేషన్ గ్రామాల అంతర్గత రోడ్లు ఆయకట్టు రోడ్ల నిర్మాణం లాంటి అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న రాముడు ఆపరేటర్‌గా పదోన్నతి పొంది వెలుగోడు బదిలీకైన సందర్భంగా ఆయనకు సన్మానం చేశారు. కార్యక్రమంలో బండ ఆత్మకూరు సర్పంచ్ ఎరుకల సంధ్య, ఎంపీడీవో వాసుదేవగుప్త, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీకు జడ్పి పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని తుమ్మలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నంద్యాల, కర్నూలు ఉమ్మడి జిల్లాల పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వహించిన పోటీల్లో తుమ్మలూరు పాఠశాల విద్యార్థులు పాల్గొని అండర్ 17 బాలికల విభాగంలో బాల్ బ్యాడ్మింటన్ గేమ్‌లో జి సుస్మిత, అండర్ 14 బాలుర విభాగంలో ఎస్ ఉమేష్ చంద్ర ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయికి విద్యార్థులు ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి సుంకన్న, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం. సుమలత, ఉపాధ్యాయులు విద్యార్థులను బుధవారం అభినందించారు .

మహాసభను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - మిడుతూరు

ఈనెల 27, 28న నంద్యాల జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండల సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండల అధ్యక్షులు లింగస్వామి అధ్యక్షతన మండలం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యుడు కే భాస్కర్ రెడ్డి, మండల కార్యదర్శి జి నాగమణి, సహాయ కార్యదర్శి బి వెంకట శివుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్కీం వర్కర్స్ కి 26 వేల కనీస వేతనం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అంగన్వాడి యూనియన్ శకుంతల, ఆశ యూనియన్ సులోచన మధ్యాహ్నం భోజనం రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీకి స్వస్తి చెప్పండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నాటుసారా తయారీకి స్వస్తి చెప్పి మంచి మార్గంలో పయనించి ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును అందిపుచ్చుకొని సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో 'నాటు సారా తయారీ నిర్మూలన - పరివర్తన ప్రత్యామ్నాయ జీవనోపాధికి చిరు వ్యాపారులు, చిన్న పరిశ్రమల ఏర్పాటుకు రుణాల పంపిణీ' కార్యక్రమంలో జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నాటు సారా తయారీదారుల్లో పరివర్తన తీసుకువచ్చి ప్రత్యామ్నాయ జీవనోపాధులు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో 19 మండలాల్లోని 200 మంది నాటు సారా తయారీ వ్యక్తులను గుర్తించి డిఆర్డిఎ-ఐకెపి సంస్థ ద్వారా మొదటి విడతలో 23 మందికి 13 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రుణాలు పొంది చిరు వ్యాపారాలు చేసే లబ్దిదారులు భవిష్యత్తులో నాటుసారా తయారుచేసి విక్రయిస్తే పిడి యాక్ట్ నమోదు చేస్తామని సూచించారు. ఇంకా మిగిలిన కుటుంబాలకు కూడా రుణాలు మంజూరు చేసి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పిస్తామన్నారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ నాటు సారా తయారీ మానుకొని జనజీవన స్రవంతిలోకి రావాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు వ్యక్తిగత రుణ చెక్కులు, మెగా చెక్కును కలెక్టర్, ఎస్‌పిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాస శివదీక్ష విరమణలు ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీశైలం

కార్తీక మాస శివ దీక్ష విరమణ కార్యక్రమం బుధవారం నాడు ప్రారంభమైంది. 5 రోజులపాటు ఈ శివ దీక్ష విరమణ కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమానికి పలు ఏర్పాట్లు చేసిన్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న తెలిపారు. ఐదు రోజులపాటు శివ దీక్ష విరమణ కార్యక్రమం పాతాళగంగ మార్గంలోని శివ దీక్ష శిబిరాలలో కార్యక్రమానికి ఏర్పాట్లు చేయడం జరిగిందని ఇఒ పేర్కొన్నారు. దీక్ష విరమణ కార్యక్రమానికి ప్రత్యేక డ్యూటీలను సిబ్బందిన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వాళ్ళను దర్శించుకునేందుకు వచ్చిన శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్న సిద్ధ రామ శివాచార్యపండితారాధ్య స్వామికి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రపాణి రెడ్డి, ఇఒ లవన్న, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.

పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే ఆర్థర్ అంగన్‌వాడీ కేంద్రం, ఎంపిపి స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ప్రతిరోజు చిన్నారులకు గుడ్లు అందించాలని, చిన్న సైజులో కాకుండా పెద్ద సైజు గుడ్లను ఇవ్వాలన్నారు. వరుసగా కొన్ని రోజులు అంగన్వాడీ కేంద్రానికి చిన్నారులు రాకపోతే వారి తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకోవాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని అడిగారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలయ్య, ఎంపీటీసీ సభ్యులు వెంకటమ్మమ, కృపాకర్, వైసీపీ నాయకులు పెద్దన్న, పల్లె శివానందరెడ్డి, కృష్ణారెడ్డి, ఉస్మాన్ బాష, దిలీప్ రాజ్ కార్యకర్తల్ను, పాల్గొన్నారు.

దళితులకు ఇచ్చిన భూములను వెంటనే చూపించాలి

- రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - మిడుతూరు

మండల కేంద్రంలోని దళితులకు అలగనూరు గ్రామ పొలిమేరలో పట్టా ఇచ్చినటువంటి రైతులకు పొలాలను చూపించాలని ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రైతు సంఘం కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ 1996లో ప్రభుత్వం అసైన్మెంట్ కమిటీలో తీర్మానం చేసి భూమిలేని దళితుల పేదలకు ఒక కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున పట్టాలిచ్చిందని, ఆ భూములకు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్నారని, అధికారులు మాత్రం భూములను చూపడంలేదని అన్నారు. ఇదే సమస్యపై రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మిడుతూరు తహశీల్దార్ కార్యాలయం ముందు రిలే దీక్షలు చేపడితే..15 రోజుల లోపల న్యాయం చేస్తానని తహశీ ల్దార్ హామీ ఇచ్చి ఇప్పటి వరకు పరిష్కరించలేద న్నారు. తక్షణమే కలెక్టర్ దృష్టికి తీసుకొని పోయి భూములను చూపి ంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్డిఓ కార్యాలయం ముందు రిలే దీక్షలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ మెంబర్ వి. రామకృష్ణ, రైతులు జయరాముడు, సుజ్ఞానం, ఏసన్న, సురేష్, పుల్లయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

వాహనాల చోరీ దొంగలు అరెస్టు

12 మోటార్ సైకిళ్లు, 15 స్కూటీలు,

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని నంద్యాల పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం స్థానిక జిల్లా ఎస్పి కార్యాలయంలో ఏఎస్పి రమణతో కలిసి ఎస్పి కె.రఘువీర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ నంద్యాల గుంతల వీధికి చెందిన చెంగల్పట్టు నీలకంఠం కళ్యాణ్ చక్రవర్తి, నందికొట్కూ ర్‌కు చెందిన చిక్కొండ అర్జున్ అలియాస్ కురువ అర్జున్‌లు పలు దొంగతనాలకు పాల్పడి మంగళవారం సాయంత్రం చెరువు కట్ట టి జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో వారిని పట్టుకున్నట్లు తెలిపారు. నంద్యాల టౌన్ పార్క్ రోడ్డులో ఈ నెల 25న రాత్రి బజాజ్ పల్సర్‌ను దొంగతనం చేసి అమ్ముకునేందుకు వెళ్తుండగా పట్టుకుని బైకును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అనంతరం వారిని విచారించగా నంద్యాల వన్ టౌన్, టూ టౌన్, కడప టూ టౌన్ పరిధిలో ఒక బొలెరో వాహనం, 29 మోటార్ సైకిల్స్ దొంగతనం చేసినట్లు దొంగలు ఒప్పుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వాహనాలతో పాటు 26 మోటార్ సైకిళ్లను, బొలెరో వాహనంను ఇద్దరు నిందితుల ఇండ్ల వద్ద, వారు అమ్మిన వారి వద్ద నుండి వాహనాలను స్వాధీనం పరచుకొని ఈనెల 29న రాత్రి 9 గంటలకు అరెస్టు చేసినట్లు చెప్పారు. దొంగలించిన ఇంకా రెండు మోటార్ సైకిళ్లలను, బొలెరో వాహనంను వారి వద్ద నుండి స్వాధీనం చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. 2016 నుండి వాహనాల దొంగతనాలు చేస్తున్నట్లు వారు ఒప్పుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి చోరీకి పాల్పడిన వారిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించడంతో పాటు రివార్డులు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

గొలుసు దొంగలించిన నేరస్తుడు అరెస్టు

నవంబర్ 24న వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గాంధీ చౌక్‌లోని కూరగాయల మార్కెట్‌లో నడిగడ్డ ప్రాంతానికి చెందిన లక్ష్మీ బాయి ఒంటిపై ఉన్న నల్ల పూసల బంగారు తాళిబొట్టు గొలుసును దొంగలిచిన మిషన్ కాంపౌండ్‌కు చెందిన గుర్రం బాలు అలియాస్ బాల శివ రాముడును అరెస్టు చేసినట్లు ఎస్పి తెలిపారు. బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డిఎస్పి మహేశ్వర్ రెడ్డి, వన్ టౌన్ సిఐ కృష్ణయ్య, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌డిఒ నిర్లక్ష్యం

ప్రతిభా క్రీడాకారులకు అన్యాయం

ప్రజాశక్తి - పాణ్యం

జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా 50 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన ఎపి సిఎం కప్ ప్రైజ్‌మనీ కబడ్డీ పోటీల్లో డిఎస్‌డిఒ నిర్లక్ష్యం కారణంగా ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అన్యాయం జరిగింది. గత నెల 29న నియోజకవర్గాల స్థాయిలో నంద్యాల పట్టణంలో డిఎస్‌డిఒ రాజు ఆధ్వర్యంలో కబడ్డీ ఫైనల్ పోటీలు జరిగాయి. డోన్, పాణ్యం నియోజకవర్గాల జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోటీలు వివాదాస్పదానికి గురయ్యాయి. అర్హత లేని న్యాయ నిర్ణేతలు, ప్రతిభ గల క్రీడా రెఫరీలకు ఆహ్వానం ఇవ్వకపోవడం, సిఎం కప్ కమిటీ సభ్యులకు తెలియకుండా నిర్ణయాలు, ఫ్లడ్ లైట్ల వెలుతురు లేకుండా రాత్రి వరకు క్రీడల నిర్వహణ సాగుతోంది. ఫైనల్ మ్యాచ్‌లో చివరి నిమిషంలో పాణ్యం నియోజకవర్గం 2 పాయింట్లు ఆధిక్యత ఉంది. వెలుతురు లేదనే ఉద్దేశంతో ఒక రైడ్ విషయంలో ఒక అంపైర్ ఒక డెసిషన్ సెకండ్ ఎంపైర్ వ్యతిరేక డెసిషన్ ఇచ్చారు. పాణ్యం నియోజకవర్గ జట్టు ఒక పాయింట్‌తో గెలవాల్సిన సమయంలో డిఎస్‌డిఒ జోక్యం చేసుకొని మళ్లీ మరుసటి రోజు ఉదయం ఫ్రెష్‌మ్యాచ్ పెడతానని నిర్ణయించారు. కానీ పాణ్యం నియోజకవర్గ క్రీడాకారులు నిర్ణీత సమయానికి రాలేదని, ఎలాంటి ఇంటిమేషన్ ఇవ్వకుండా తాము సాయంత్రం నాలుగు గంటలకు వస్తున్నామని చెప్పినా వినకుండా సిఎం కప్‌కమిటీ సభ్యులకు ఎలాంటి ఇంటిమేషన్ ఇవ్వకుండా ఏకపక్షంగా ప్రతిభగల క్రీడాకారులకు పోటీ నిర్వహించకుండా డోన్ నియోజకవర్గం జట్టు గెలిచినట్లు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు. కబడ్డీ పోటీలు 6 మంది న్యాయ నిర్ణేతల ద్వారా నిర్వహించాల్సి ఉంది.

కానీ ఇద్దరే న్యాయ నిర్ణేతల ద్వారా పోటీలు నిర్వహించడం గమనార్హం. సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ప్రతిభ గల క్రీడాకారులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

' ఇండోర్ 'టూర్‌కు మంత్రుల సానుకూల స్పందన

ప్రజాశక్తి-డోన్

దేశంలో ప్రథమ స్థానంలో ఉన్న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని 'ఇండోర్' మున్సిపల్ కార్పొరేషన్ అధ్యయ నానికి స్టడీటూ ర్‌కు ఎపి మున్సిపాలిటీల ఛైర్మన్లు వెళ్లేందుకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర మున్సిపల్ శాఖమంత్రి ఆదిమూలపు సురేష్ సానుకూలంగా స్పందించారని డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈ విషయంపై ఇటీవల ఆర్థిక మంత్రిని , మున్సిపల్ శాఖ మంత్రిని రాష్ట్ర మున్సిపల్ ఛైర్మన్ల సంఘం ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం సమర్పించామన్నారు. ఇద్దరు మంత్రులు మాట్లాడుకుని ఫైనాన్స్ క్లియరెన్స్ ఇచ్చారని త్వరలో ఇండోర్ మున్సిపాలిటీని అధ్యయనం చేయడానికి షెడ్యూలు ఖరారు అయ్యే అవకాశం ఉందని ఆశాభావం వక్తం చేశారు.


ఆర్థిక మంత్రికి వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ ఛైర్మన్లు రాజేష్ తదితరులు

చెంచు గిరిజన మహిళలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

ప్రకాశం జిల్లా దోర్నాల మండలం పరిధిలోని చిన్నారుట్ల, తుమ్మల బైలు, చింతల, మర్రిపాలెం చెంచు గూడాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న చెంచు మహిళలకు ఉద్యోగ, ఉపా ది అవకాశాలు కల్పించాలని కొమరం భీమ్ చెంచు సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు ఆశీర్వాదం పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చెంచు గూడాలలోని చెంచుల సమస్యలపై సందర్శించినప్పుడు దోర్నాల -శ్రీశైలం ప్రధాన రహదారి వెంట చదువుకున్న చెంచు మహిళలు ఉసిరికాయలు అమ్ముకుంటూ ఉన్నారని అన్నారు. ఐటీడీఏ పరిధిలోని చిన్న ఉద్యోగం కూడా రాలేదని మహిళలు వాపోతున్నారని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన చెంచుల బతుకులు మాత్రము మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు ఎన్నోసార్లు దరఖాస్తులు చేసుకున్న ఇంకా ఖాళీలు పోస్టు భర్తీ చేయడం లేదన్న అని అన్నారు. గత్యంతరం లేక విధి లేని పరిస్థితుల్లో తల్లిదండ్రులను పోషించుకునే దారి లేక ఇలా రహదారుల వెంట ఉసిరికాయలు అమ్ముకుంటున్నామని ఆయనకు వివరించారని తెలిపారు. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే మార్గంలో మంత్రులు, శాసనసభ్యులు ప్రయాణం చేస్తున్నారని కానీ వారిని ఎవరు పట్టించుకొనక పోవడం కొసమెరుపు అన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారిన వారి తలరాతలు మారడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చదువుకున్న చెంచు గిరిజన మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

పల్లెలను వణికిస్తున్న చలిపులి

- చలి మంటలు వేసుకుంటున్న పల్లె ప్రజలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

గత రెండు రోజుల నుంచి పల్లెల్లో చలిపులి వనికిస్తూ చలి మంటలు వేసుకోవడం జరుగుతుంది. కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రాత్రి 8 గంటల నుంచి ఉదయం 7 గంటల దాకా విపరీతంగా చలి ఉండడంతో పల్లెల్లో ఉన్న ప్రజలంతా చలి మంటలు వేసుకోవడం జరుగుతుంది. చిన్నపిల్లలు, వృద్ధులు చలిని తట్టుకోలేక స్వెటర్లను వేసుకుంటున్నారు. చలి తీవ్రత పెరగడంతో చిన్నపిల్లలకు జలుబు పలు ఆరోగ్య సమస్యలు కూడా పెరుగుతున్నాయి. చిన్నపిల్లలు చలికాలంలో పలు జాగ్రత్తలు తీసుకునే విధంగా పెద్దలు చూసుకోవాలని వైద్యులు సూచనలు ఇస్తున్నారు. పొలాల్లో సైతం మంచు కురుస్తుంది.


మంట కాచు కుంటున్న ప్రజలు

విశ్వ మానవతావాది గురజాడ

సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి - నంద్యాల

తన సాహిత్యం ద్వారా విశ్వమానవతావాదాన్ని లోకానికి చాటి చెప్పిన మహాకవి గురజాడ అప్పారావు అని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. గురజాడ 107వ వర్ధంతి సందర్భంగా సాహితీ స్రవంతి, జన విజ్ఞాన వేదిక, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నంద్యాల వివేకానంద ఆడిటోరియంలో 'గురజాడ రచనలు-దేశభక్తి' అంశంపై సదస్సు నిర్వహించారు. ముందుగా గురజాడ చిత్రపటానికి సాహితీ వేత్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, ప్రధాన వక్త డాక్టర్ వైష్ణవ వెంకటరమణమూర్తి, ఐద్వా అధ్యక్షురాలు నిర్మల తదితరులు మాట్లాడారు. అనంతరం విజేతలకు పుస్తకాలను, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి మాదాల శ్రీనివాసులు, జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగరాజు, గోపాల్, మణి శేఖర్ రెడ్డి, నాగేంద్రుడు, అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, నరేంద్ర, నీలం వెంకటేశ్వర్లు, కిషోర్, హుస్సేన్ రెడ్డి, మాబుబాష తదితరులు పాల్గొన్నారు. **డోన్ :** డోన్ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో గురజాడ అప్పారావు వర్ధంతి వేడుకలు నిర్వహించినట్లు సిపిఎం పట్టణ మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్ కే నాగరాజులు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుజాడ గొప్ప సంఘసంస్కర్త అన్నారు.ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి దేవి, కులుషంబీ,ఎస్ ఎఫ్ ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు అశోక్, తెలుగు విజయ్ చిన్న రోళ్లపాడు నాగరాజుతదితరులు పాల్గొన్నారు. **పట్టణంలోని పాతపేటలో** జడ్పి ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ అధ్యక్షతన గురుజాడ అప్పారావు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో గురుజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ, ఉపాధ్యాయులు ఎం.వెంకట సుబ్బారెడ్డి, దేవేంద్రప్పలు మాట్లాడారు.



గురజాడ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలి : వ్యకాసం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ఈనెల 8, 9, 10 తేదీల్లో జంగారెడ్డి గూడెంలో నిర్వహించే రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలను విజయవంతం చేయాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాయుడు, డేవిడ్ కోరారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో మహాసభల వాల్ పోస్టర్లను సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య రాజు, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు చాంద్ బాషాతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలకు అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు పార్లమెంట్ సభ్యులు బృందాకారత్, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకట్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, తదితరులు హాజరవుతున్నారు. భవిష్యత్తులో వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధి హామీ కూలీల సమస్యల పైన తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ కార్మికులు, ఉపాధ్యాయ కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.


మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

సేవ చేయడమే ఇన్నర్ వీల్ క్లబ్ లక్ష్యం

ప్రజాశక్తి - డోన్

సమాజంలో ప్రజలకు సేవ చేయడమే ఇన్నర్ వీల్ క్లబ్ లక్ష్యమని ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్ఎ శాంతి అన్నారు. బుధవారం పట్టణంలోని మర్రి సరళా దేవి ఆర్థిక సౌజన్యంతో పోస్ట్ కార్యాలయంలో ప్రజలకు కూర్చోవడాని కి పదివేలు విలువచేసే నాలుగు సిమెంట్ బెంచీలను పోస్ట్ మాస్టర్ గరీబ్ బాషకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోస్ట్ కార్యాలయంలో నిత్యం ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉంటారని వారిని దృష్టిలో ఉంచుకొని ఈ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రజలకు ఉపయోగపడే విధంగా పోస్ట్ కార్యాలయంలో సిమెంటు బెంచీల సౌకర్యం కల్పించిన మర్రి సరళా దేవిని పోస్ట్ ఆఫీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐపిఓ అభిషేక్, ఇన్నర్ విల్ క్లబ్ సభ్యులు సుస్మిత, శైలజ, అనురాధ, విమలమ్మ, అనంతలక్ష్మి మంజుల పద్మ, విజయమ్మ, సుధాబట్, మద్దమ్మ, లక్ష్మీ, ఉషారాణి, శకుంతల షాలిని తదితరులు పాల్గొన్నారు.


ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పోస్ట్ ఆఫీస్ లో బెంచీలను ఏర్పాటు చేసిన దృశ్యం